



సోమశిలలో 24.611 టీఎంసీల నీటి నిల్వ

అనంతసాగరం, ఫిబ్రవరి 4: సోమశిల జలాశయం పూర్తిసామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా, ఆదివారం నాటికి 24.611 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ డెల్టాకు 2,250, ఉత్తర కాలువకు 500, దక్షిణ కాలువకు 200 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

రూ.100 కోట్ల భూమి స్వాహా!

ప్రభుత్వ భూమి, అటవీ, సాగునీటి కాలువ, చెరువు ఇలా ఎక్కడ ఖాళీ స్థలం కనిపిస్తే చాలు అక్కడకు కబ్జారాయుళ్లు వాలిపోతున్నారు. అధికార దర్పంతో రెవెన్యూ వర్గాలను మచ్చిక చేసుకోవడంతోపాటు నకిలీ పట్టాలు సృష్టించి భూమిని హస్తగతం చేసుకుంటున్నారు. గడిచిన నాలుగేళ్లలో అనేక భూ కుంభకోణాలు ఉమ్మడి నెల్లూరు జిల్లాలో వెలుగుచూడగా వాటన్నిటినీ తలదన్నేలా భారీ కుంభకోణం నెల్లూరు నగర పరిధిలో జరిగింది. అత్యంత పకడ్బందీగా, సామాన్యులకు అర్థంకాని విధంగా పక్కా స్కెచ్ వేసి రూ.వంద కోట్ల విలువైన కాలువ భూమిని కొట్టేశారు. నెల్లూరు రూరల్ మండలం అల్లీపురం రెవెన్యూ పరిధిలో జరిగిన ఈ భూ కుంభకోణం సమాచార హక్కు చట్టం ద్వారా వెలుగులోకి వచ్చింది.



- నెల్లూరు రూరల్ అల్లీపురంలో భారీ భూ కుంభకోణం
- 15.09 ఎకరాల కాలువ భూమి ధారాదత్తం
- ఆర్ఎస్ఆర్‌లో కాలువ.. నేడు పట్టాగా మార్పు
- ఏడాదిన్నర క్రితం 22ఏ నుంచి తొలగింపు
- తెలివిగా సబ్ డివిజన్ చేసి స్వాహాకు స్కెచ్ వేసిన అక్రమార్కులు

నెల్లూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : అల్లీపురం రెవెన్యూ పరిధిలోని ఓ సర్వే నంబరులో 11.31 ఎకరాల కాలువ, మరో సర్వే నంబర్‌లో 3.78 ఎకరాల కాలువ ఉంది. ఈ రెండు సర్వే నెంబర్లను ఆర్ఎస్ఆర్‌లో పరిశీలించగా కాలువ అని నమోదై ఉంది. అయితే, ప్రస్తుతం వెబ్‌ల్యాండ్‌ను పరిశీలిస్తే ఆ భూములన్నీ వేర్వేరు వ్యక్తుల పేర్లపై ఉన్నాయి. ఈ వ్యవహారాన్ని చూసి రెవెన్యూ వర్గాలే విస్తుపోయాయి. కాలువ అనే సహజ వనరు చాలా విలువైనది. కాలువ భూములను పేదల ఇళ్లకు లేదా అసైన్‌మెంట్ కింద కాని పంపిణీ చేసేందుకు వీల్లేదని నిబంధనలు చెబుతున్నాయి. మరి అల్లీపురంలో 15.09 ఎకరాల కాలువను అధికారులు మరొకరి పేర్లపైకి ఎలా మార్చారన్నదే మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది. ఏడాదిన్నర క్రితం ఈ రెండు సర్వే నంబర్లలోని 15.09 ఎకరాల భూమి నిషేధిత జాబితాలో ఉంది. అయితే నెల్లూరు ఆర్డీవో నివేదిక ప్రకారం అప్పటి కలెక్టర్.. ఈ భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించాలని జిల్లా రిజిస్ట్రార్‌కు లేఖ రాశారు. దీంతో కాలువ భూములను 22ఏ నుంచి తొలగించారు. ఈ ప్రాంతంలో అంకణం విలువ రూ.రెండు లక్షల వరకు పలుకుతోంది. మొత్తంగా భూమి విలువ చూసుకుంటే రూ.వంద కోట్ల పైమాటగానే కనిపిస్తోంది. దీంతో ఇప్పుడు అత్యంత వేగంగా ఆ భూముల అమ్మకాలు జరిగిపోతున్నాయి.

● విస్తీర్ణం ఎక్కువగా చూపించి..

వందేళ్ల క్రితం ఆర్ఎస్ఆర్ తయారు చేశారు. అంటే అప్పటికి, ఇప్పటికి భూ విస్తీర్ణం పెరిగిపోతుందా? కానీ అల్లీపురంలో అదే జరిగింది. సర్వే నంబర్‌లో ఉండాల్సిన విస్తీర్ణానికి, వెబ్‌ల్యాండ్‌లో చూపిస్తున్న విస్తీర్ణానికి భారీ తేడా కనిపిస్తోంది. ఆర్ఎస్ఆర్ ప్రకారం ఓ సర్వే నంబర్‌లో 11.31 ఎకరాలు కాలువగా నమోదై ఉంది. ఆ సర్వే నంబర్‌ను మూడు సబ్ డివిజన్లుగా చేసి ఇప్పుడు 22.62 ఎకరాలుగా చూపిస్తున్నారు. అందులో రెండు సర్వే నంబర్లలోని 16.61 ఎకరాలను 22ఏ నుంచి తొలగించాల్సిందిగా జిల్లా రిజిస్ట్రార్‌కు రాసిన లేఖలో కలెక్టర్ పేర్కొన్నారు. అలానే అదే సర్వే నంబర్‌లోని మూడో సబ్ డివిజన్‌లో మిగిలిన 6.01 ఎకరాలను కాలువగా చూపిస్తూ దానిని మాత్రం 22ఏ జాబితాలో కొనసాగించాలని ఆదేశించారు.

దీనిని బట్టి చూస్తే ఆ సర్వే నంబర్‌లో మొత్తం విస్తీర్ణం 11.31 ఎకరాలు కాగా దానిని రెట్టింపు చేశారు. అంటే ఒక సర్వే నంబర్లో కాలువగా ఉన్న దానిని సగం కాలువగా, మిగిలిన దానిని పట్టాగా అధికారులు ధ్రువీకరించారన్నమాట. ఎందుకిలా చేశారు? ఏ రికార్డుల ఆధారంగా కాలువను పట్టాగా మార్చారన్నది ఇప్పుడు అనేక అనుమానాలకు తెరతీస్తోంది. ఈ కాలువ భూమిని నిషేధిత జాబితా నుంచి తొలగించేందుకు ఆర్డీవో ఇచ్చిన నివేదికను ఓ వ్యక్తి సమాచార హక్కు చట్టం ద్వారా కోరగా ఆ వివరాలు తహసీల్దార్ కార్యాలయంలో గానీ ఆర్డీవో కార్యాలయంలో గానీ లేవు. ఆ ఫైల్ మొత్తాన్ని కలెక్టరేట్‌కు అప్పగించినట్లు సమాధానం ఇవ్వడం గమనార్హం.

'చేయూత'లో కోత !

- లబ్ధిదారుల తగ్గింపునకు అడ్డదారులు
- విద్యుత్ వినియోగం 300 యూనిట్లు దాటించేయత్నం
- ఆరునెలల నుంచి అదిగో.. ఇదిగో అంటూ జాప్యం
- పథకం అమలుపై అనుమానాలు

సంగం, ఫిబ్రవరి 4: సంక్షేమ పథకాల లబ్ధిదారులను ప్రతిఏటా తగ్గించడమే లక్ష్యంగా వైసీపీ ప్రభుత్వం అడ్డదారులు తొక్కుతోంది. ఈ కోవలోకి ఇప్పుడు చేయూత పథకం చేరింది. వైస్సార్ చేయూత అంటే 45 ఏళ్ల నిండిన ప్రతి బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ మహిళలకు ఏడాదికి రూ. 18,750ల చొప్పున నాలుగేళ్లలో రూ. 75,000లు ఆయా కార్పొరేషన్ ద్వారా ఉచితంగా అందచేసే పథకం. దీని అమలుకు ప్రభుత్వం నిబంధనలు పెట్టింది. విద్యుత్ వినియోగం 300 యూనిట్లు దాటరాదు. నాలుగు చక్రాల వాహనం ఉండరాదు. ఐటీ చెల్లింపులు చేసి ఉండకూడదు. ఇంట్లో ప్రభుత్వ పింఛను తీసుకునేవారు ఉండకూడదు. ఇంటి స్థలం, పొలం నిర్ణీత విస్తీర్ణాన్ని మించి ఉండకూడదు ... అంటూ షరతులు విధించింది. వాటిని అమలు చేసిన కారణంగా గత మూడు దఫాల్లోనే పలువురు చేయూత పథకానికి అనర్హులుగా మారిపోయారు. ఈసారి లబ్ధిదారులను ఏరివేసేందుకు అవకాశం దొరకలేదు. దీంతో అడ్డదారుల్లో లబ్ధిదారులను మోసం చేసేందుకు పన్నాగం పన్నింది.

● విద్యుత్ వినియోగం పేరుతో..

ఆరు నెలల సగటు కాకుండా, మొత్తం విద్యుత్ వినియోగంలో అత్యధికంగా విద్యుత్ వినియోగించిన నెలల్ని ఎంచుకుని ఆ సగటును చూపించి చేయూత లబ్ధిదారులను తొలిస్తోంది. గతంలో ఎప్పుడో కారు కొని ఉండి అది ఇప్పుడు అమ్ముకుని ఉన్నా తొలగిస్తున్నారు. ఐటీ విషయంలో కూడా ఇదే జరుగుతుంది. గృహరుణం కోసం గతంలో చెల్లించిన ఐటీ చెల్లింపులు, ఐటీ కట్టినవారు రేషన్ కార్డులో ఉన్నారనే కారణంతో చాలా మందికి చేయూతను ఆపేశారు.

● ఆరునెలలుగా ఊరిస్తూ...

వైసీపీ అధికారం చేపట్టిన 14 నెలల తరువాత 2020లో పథకాన్ని ప్రారంభించారు. 2021 జూన్‌లో రెండో దఫా చేయూత నగదు అందించిన ప్రభుత్వం, 2022 సెప్టెంబరు 23 వరకూ మూడో దఫా అందించలేదు. అంటే 2021 తర్వాత మరో 16 నెలలకుగానీ లబ్ధిదారులకు చేయూత దక్కలేదు. కాగా గతేడాది సెప్టెంబరు నుంచి చేయూత ఇదిగో.. అదిగో అంటున్న ప్రభుత్వం ఇప్పటి వరకూ ఆ ఊసే ఎత్తలేదు. ఎన్నికల కోడ్ సమీపిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వమే కావాలని జాప్యం చేస్తుందా ? అన్న అనుమానాలను లబ్ధిదారులు వ్యక్తం చేస్తున్నారు.



సీతారామపురంలో ఆసరా చెక్కు పంపిణీ చేస్తున్న మేకపాటి రాజగోపాల్‌రెడ్డి(ఫైల్)

మహీధరరెడ్డికే కందుకూరు ?

- త్వరలో ప్రకటించే అవకాశం

కందుకూరు, ఫిబ్రవరి 4: కందుకూరు నియోజకవర్గ వైసీపీ అభ్యర్థిగా సిటింగ్ ఎమ్మెల్యే మానుగుంట మహీధరరెడ్డి పేరు ఖరారైనట్లు తెలిసింది. కందుకూరు స్థానాన్ని బీసీలకు కేటాయిం చాలన్న ఆలోచనతో గత నెలరోజులుగా వివిధ ప్రయత్నాలు చేసిన పార్టీ అధిష్ఠానం సరైన అభ్యర్థి దొరక్కపోవటం, సర్వే నివేదికలు కూడా మహీధరరెడ్డికే అనుకూలంగా ఉండటంతో ఆయన పేరును ఖరారు చేసినట్లు తెలిసింది. కాగా జిల్లాకు చెందిన పలువురు ముఖ్యనేతలు, ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకరరెడ్డిలు మహీధరరెడ్డికే కందుకూరు కేటాయించాలని జగన్‌పై ఒత్తిడి తేవటంతో మనసు మార్చుకున్న జగన్, మహీధరరెడ్డికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు విశ్వసనీయ సమాచారం. మంగళవారం వెల్లడించే జాబితాలో మహీధరరెడ్డి పేరును ప్రకటించనున్నట్లు సీఎంవో నుంచి ఇక్కడి నేతలకు సమాచారం అందింది. శనివారం రాత్రే సీఎంవో నుంచి సమాచారం వచ్చిందని స్థానిక పార్టీ నేతలు ధ్రువీకరించారు. కాగా నెల్లూరు పార్లమెంట్‌కు వీపీఆర్ పోటీ చేయని పక్షంలో మహీధ రరెడ్డి కూడా నిర్ణయం మార్చుకునే అవకాశాలు ఉన్నట్లు రాజకీయ పరిశీలకులు అంటున్నారు.



సరదాగా.. సంతోషంగా!

- ఉత్సాహంగా జిల్లా అధికారుల క్రికెట్ పోటీలు
- ఫైనల్‌కు చేరిన పోలీస్ టైగర్స్, కార్పొరేషన్ ఫైటర్స్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), ఫిబ్రవరి 4: వారంతా నిరంతరం ఉద్యోగ బాధ్యతలతో బిజీబిజీగా గడిపే వివిధ శాఖల జిల్లా అధికారులు... ఎన్నికల సీజన్ ప్రారంభం అయినప్పటి నుంచి క్షణం తీరిక లేకుండా పగలు, రాత్రి అన్న తేడా లేకుండా పనిలో నిమజ్ఞమయ్యారు. అలాంటి అధికారులు ఆదివారం అన్నీ మరిచిపోయి క్రికెట్ పోటీల్లో తోటి ఉద్యోగులతో సరదాగా గడుపుతూ కనిపించారు. నగరంలోని పోలీసు కవాతు మైదానంలో ఆదివారం జిల్లా అధికారులు టీమ్‌లుగా విడిపోయి క్రికెట్ పోటీల్లో నువ్వానేనా అన్న రీతిలో తలబడ్డారు. జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈ లీగ్ పోటీలు జరిగాయి. కలెక్టర్ కెప్టెన్‌గా రెవెన్యూ రాయల్స్ టీమ్, ఎస్పీ కెప్టెన్‌గా పోలీస్ టైగర్స్ టీమ్, కార్పొరేషన్ కమిషనర్ కెప్టెన్‌గా మున్సిపల్ కార్పొరేషన్ ఫైటర్స్ టీమ్, డీఆర్‌డీఏ పీడీ కెప్టెన్‌గా డిస్ట్రిక్ట్ ఆఫీసర్స్ టీమ్ పోటీల్లో పాల్గొన్నాయి. తొలత రెవెన్యూ రాయల్స్ జట్టు, పోలీస్ టైగర్స్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో పోలీసు టైగర్స్ జట్టు విజేతగా నిలిచింది. ఈ మ్యాచ్‌లో ఎస్పీ డాక్టర్ కే తిరుమలేశ్వరరెడ్డి బ్యాటింగ్‌లో ఆకట్టుకోగా, కలెక్టర్ ఎన్ హరినారాయణన్ బౌలింగ్‌తో ఆకట్టుకున్నారు. రెండవ మ్యాచ్‌లో మున్సిపల్ కార్పొరేషన్ ఫైటర్స్ జట్టు, డిస్ట్రిక్ ఆఫీసర్స్ జట్టు తలపడ్డాయి. కార్పొరేషన్ ఫైటర్స్ జట్టు విజేతగా నిలిచింది. ఈ నెల 18వ తేదీ ఆదివారం విజేత జట్ల మధ్య ఫైనల్స్ జరగనుంది.

కుట్రను పసికట్టే పోటీకి దూరం ?

- మనస్తాపంతో వీపీఆర్
- జిల్లాను కుదిపేసిన నగర అభ్యర్థి నిర్ణయం
- అడకత్తెరలో పోకచెక్కలా అధికార పార్టీ
- నెల్లూరులో వైసీపీకి కర్ణశాపాలు

నెల్లూరు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లా వైసీపీని కర్ణశాపాలు చుట్టుముట్టాయి. దీంతో ఆ పార్టీ పరిస్థితి అడకత్తెరలో పోకచెక్కలా తయారైంది. పార్టీ సర్వేలు... జిల్లా నేతల ఫిర్యాదులు.. ఏమైతేఏం... ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌ను నెల్లూరు సిటీ నుంచి నరసారావుపేట ఎంపీ స్థానానికి పంపారు. అనిల్ పోతూ పోతూ తన స్థానంలో తన అనుచరుడు, డిప్యూటీ మేయర్ ఎండీ ఖలీల్ అహ్మద్‌ను అభ్యర్థిత్వాన్ని ఖరారు చేయించుకుని వెళ్లారు. ఎవరి ఊహకు అందని విధంగా జరిగిన ఈ నిర్ణయం జిల్లా వైసీపీలో ముసలం పుట్టేలా చేసింది.

● అజ్ఞాతంలోకి వీపీఆర్

తనతో మాటమాత్రం కూడా సంప్రదించకుండా నగర అభ్యర్థిని ప్రకటించడం పట్ల కలత చెందిన వీపీఆర్ రాజకీయాలకు స్వస్తి పలికి అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. నెల్లూరు ఎంపీ స్థానానికి పోటీ చేయకూడ దని ఆయన నిర్ణయించుకున్నారని వైసీపీ వర్గాల సమాచారం. ఆయన ఒక్కరే కాదు నెల్లూరు సిటీకి చెందిన పలువురు ముఖ్య నాయకులు సైతం ఖలీల్ అభ్యర్థిత్వాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. ఈ క్రమంలో ఎన్నికల్లో కాడె వదేయడానికి సిద్ధంగా ఉన్నామని రాష్ట్ర పార్టీ నాయకు లకు సమాచారం కూడా పంపారు.

● అటూఇటూ కదలలేని స్థితి

ఇప్పుడు అటూఇటూ కదలలేని పరిస్థితి వైసీపీకి ఏర్పడింది. ఖలీల్ అభ్యర్థి అయితే మిగతా నాయకులు పనిచేయరు. అభ్యర్థిత్వాన్ని మార్చితే ముస్లింకి టికెట్ ఇచ్చినట్టే ఇచ్చి, లాగేసుకున్నారనే అపవాదు. ఈ ప్రభావం జిల్లాలోని ముస్లింల ఓట్లపై పడుతుంది. ప్రధానంగా నెల్లూరు నగరంలో ముస్లిం ఓటర్ల సంఖ్య భారీగా ఉంది. ఆ ప్రభావం కచ్చితంగా పార్టీపై పడుతుంది. పోనీ ముస్లింలలో మరొకరికి టికెట్ ఇద్దామనుకుంటే అనిల్ వర్గం పనిచేయదు. ఇప్పటికే అనిల్‌ను నరసారావుపేటకు పంపడాన్ని ఆయన వర్గం జీర్ణించుకోలేకపోతోంది. కాని ఏదో ఒకటి జరగక తప్పని పరిస్థితి. అంటే ఎటూచూసినా నగర వైసీపీ నష్టపోవడం ఖాయమని పరిశీలకులు భావిస్తున్నారు.

● వీపీఆర్‌పై వ్యూహాత్మక కుట్ర ?

నెల్లూరు నగర కేంద్రంగా జరిగిన ఈ పరిణామాలు రాజ్యసభసభ్యుడు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డిపై వ్యూహాత్మక కుట్రలో భాగంగా జరిగింది తప్ప మరొకటి కాదని వైసీపీ వర్గాలే చెప్పుకొంటున్నాయి. వీపీఆర్‌కు, అనిల్‌కు మధ్య మూడేళ్లుగా సరైన సంబంధాలు లేవు. హుందాతనం, మెతక స్వభావం కలిగిన వీపీఆర్ అనిల్‌తో ఇమడలేక పోయారు. అయితే ఈ విభేదాలు బహిరంగంగా రచ్చకెక్కిన సందర్భాలు లేవు. అయితే ఇటీవల అనిల్‌ను నగరం నుంచి తప్పించడం వెనుక వీపీఆర్ పాత్ర కూడా ఉందనే ప్రచారం జరిగింది.



అయితే ఇందులో ఏమాత్రం నిజముందో.. అనిల్‌ను తప్పించడానికి అసలు కారణాలేమిటో తెలియలేదు కానీ, ఇందులో వీపీఆర్ పాత్ర ఉందని అనిల్ శిబిరం మాత్రం గట్టిగా నమ్ముతోంది. ఈ కారణంతోనే వీపీఆర్‌ను దెబ్బతీయడానికి అనిల్ వ్యూహాత్మకంగా పావులు కదిపారనే ప్రచారం సాగుతోంది. నెల్లూరు పార్లమెంటుకు వీపీఆర్ పోటీ చేస్తున్న విషయం తెలిసిందే. ఆయన్ను ఇబ్బందులపాలు చేయాలనే ఉద్దేశంతోనే నెల్లూరు నగరం నుంచి ముస్లిం వర్గానికి చెందిన తన అనుచరుడు ఖలీల్ పేరును అనిల్ ఖరారు చేయించాడని చెబుతున్నారు. ప్రస్తుత పరిస్థితుల ఆధారంగా అంచనా వేస్తే నెల్లూరు పార్లమెంట్ పరిధిలో నెల్లూరు సిటీ, రూరల్ నియోజకవర్గాలు టీడీపీకి చాలా బలంగా ఉన్నాయి. పార్లమెంట్‌లో జయాపజయాలను ఈ రెండు నియోజకవర్గాలే నిర్ణయిస్తాయనే అంచనాలున్నాయి. ఈ కారణంగానే అనిల్ అభ్యర్థిత్వం కూడా మార్పు చేసినట్లు ప్రచారం జరిగింది. అనిల్‌ను నరసరావుపేటకు పంపిన క్రమంలో అంతకన్నా బలమైన అభ్యర్థిని సిటీ నుంచి నిలబెడతారని వైసీపీ వర్గాలు ఊహించాయి. అయితే ఎవరి ఊహకు అందని విధంగా కేవలం అనిల్ మాటకు విలువిచ్చి జగన్ కొత్త అభ్యర్థిని ప్రకటించినట్లు అనుకొంటున్నారు. నెల్లూరు పార్లమెంట్ పరిధిలోని కందుకూరు, ఉదయగిరి, ఆత్మకూరు, నెల్లూరు సిటీ, రూరల్ నియోజకవర్గాల్లో ముస్లిం ఓట్ల సంఖ్య గణనీయంగా ఉంది. ఈ ఓటు బ్యాంకు వీపీఆర్‌కు వ్యతిరేకంగా మారే ప్రమాదం ఉంది. ఈ కుట్రను పసిగట్టిన కారణంగానే వీపీఆర్ పార్లమెంట్ స్థానానికి పోటీ చేయకూడని నిర్ణయించుకున్నారని అంటున్నారు.

తనకు వ్యక్తిగతంగా అసక్తి లేకున్నా జగన్‌రెడ్డి కోరారని ఎంపీగా పోటీకి సిద్ధపడ్డానని, అయితే విలువలు లేని చోట్ల, ఈ కుట్రలు కుతంత్రాల మధ్య పోటీ చేయాల్సిన అవసరం తనకు లేదని వీపీఆర్ భావిస్తున్నట్లు అనుకుంటున్నారు.

● అభ్యర్థుల్లో కలకలం

నెల్లూరు సిటీ అభ్యర్థి విషయం కేవలం సిటీకే పరిమితం కాలేదు. ఏకంగా జిల్లా మొత్తంలో పార్టీని సంక్షోభంలోకి నెట్టేసింది. వీపీఆర్ పార్ల మెంట్‌కు పోటీ చేయని పక్షంలో ఆ ప్రభావం మొత్తం పార్లమెంట్ పరిధిలోని ఎమ్మెల్యే అభ్య ర్థులపై పడుతుంది. వీపీఆర్ అర్థబలం, మంచి పేరు తమకు లాభిస్తాయని వైసీపీ అభ్యర్థులు ఆశప డ్డారు. ఇప్పటికే నియోజకవర్గాల్లో తిప్పి ఆయన చేత ప్రజలకు పలు హామీలు ఇప్పించారు. దీనికి తోడు జిల్లా పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో వైసీపీ రెండు, మూడు వర్గాలుగా చీలిపోయింది. పార్లమెంట్ అభ్యర్థిగా రంగంలోకి దిగిన వీపీఆర్ అసమ్మతి వర్గాలను శాంతపర చడంలో కొంత మేరకు విజయం సాధించారు. ఇప్పుడు ఆయన పోటీకి దూరమైతే జిల్లా మొత్తంపై ఆ ప్రభావం పడుతుంది. ఇలా ఏ కోణంలో చూసినా జిల్లా వైసీపీకి గడ్డుపరిస్థితులు తప్పవని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

నిరుద్యోగుల నిరుత్సాహం !

- పోస్టులు తక్కువ... పోటీదారుల ఎక్కువ
- డీఎస్సీ ప్రకటనపై పెదవి విరుపు
- అప్రెంటీస్ విధానంపై ఆందోళన
- మండిపడుతున్న ఉపాధ్యాయ సంఘాలు

నెల్లూరు (విద్య), ఫిబ్రవరి 4: ప్రతిఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని హామీలు గుప్పించిన సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆ హామీలను గాలికొదిలేసి, ఎన్నికల వేళ హడావిడిగా డీఎస్సీ డ్రామాకు తెరలేపారని నిరుద్యోగులు మండిపడుతున్నారు. ఖాళీ పోస్టుల భర్తీకి మెగా డీఎస్సీ విడుదల చేస్తామని గొప్పలు చెప్పిన వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగున్నరేళ్లు దాటినా ఒక్క డీఎస్సీ విడుదల చేయలేదని వారు పేర్కొన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో తాజాగా మంత్రిమండలిలో మెగా డీఎస్సీ నిర్వహించాలని నిర్ణయం తీసుకోవడం హాస్యాస్పదంగా ఉందని నిరుద్యోగులు ధ్వజమెత్తారు. పైగా ఎప్పుడో రద్దు చేసిన అప్రెంటీస్ విధానాన్ని తిరిగి అమలు చేసేలా పావులు కదపడం అన్యాయమని ఉపాధ్యాయ సంఘాలు మండిపడుతున్నాయి.

● దగా డీఎస్సీ

వైసీపీ ప్రభుత్వం తమను దగా చేస్తున్నదని నిరుద్యోగ యువత మండిపడుతోంది. ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతను కప్పిపుచ్చుకోవడానికి డీఎస్సీ నోటిఫికేషన్ అంటూ మభ్య పెడుతోందని వారు వాపోతున్నారు. ఐదేళ్లలో కనీసం ఒక్క డీఎస్సీ కూడా విడుదల చేయకుండా తాజాగా నిబంధనలు, షరతులతో డీఎస్సీ విడుదల చేయడం బాధాకరమని వారు పేర్కొన్నారు. లక్షలాదిమంది బీఈడీ, టీటీసీ పూర్తి చేసిన నిరుద్యోగులు చిన్నచిన్న ఉద్యోగాలు, పనులు చేసుకుంటూ డీఎస్సీ నోటిఫికేషన్ ఎప్పుడెప్పుడా అని వేయికళ్లతో ఎదురు చూస్తున్నారని, ఈ క్రమంలో ప్రభుత్వం తాజాగా ప్రకటిం చిన డీఎస్సీ చూడగానే తమ గుండెలు బరువెక్కిపోయాయని వారు పేర్కొన్నారు.

● ఖాళీలు 35 వేలు

రాష్ట్రవ్యాప్తంగా 35వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉండగా, కేవలం 6,100 పోస్టులు మాత్రమే భర్తీ చేయాలని నిర్ణయించారు. ఉన్న ఖాళీలను 117 జీవో ముసుగులో కుదించడంతోపాటు విద్యార్థులు, ఉపాధ్యాయుల నిష్పత్తిని తగ్గించారు. ఈ పోస్టుల్లో కూడా జడ్పీ, ప్రభుత్వ, పురపాలక, సంక్షేమ, ఆశ్రమ తదితర పాఠశాలల్లోని ఖాళీలు భర్తీ చేయాలని భావిస్తున్నట్లు చెబుతున్నారు. గతంలో వేర్వేరుగా ప్రకటనలు జారీ చేసి భర్తీ చేసేవారు. అన్నీ కలిపి ఒకే ప్రకటన ద్వారా భర్తీ చేయడం నిరుద్యోగులను దగా చేయడమే నని వాపోయారు.


అప్రెంటీస్ విధానంపై ఆందోళన

వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఉద్యోగులు, ఉపాధ్యాయులకు వేతనాలు కూడా సకాలంలో ఇవ్వలేదు. ఈ నేపథ్యంలో 2024 డీఎస్సీ విడుదల చేయాలని, ఉపాధ్యాయులుగా నియమితులయ్యే వారికి అప్రెంటీస్ విధానం అమలు చేయాలని నిర్ణయించడం పట్ల ఉపాధ్యాయ సంఘాలు, నిరుద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అప్రెంటీస్ విధానాన్ని 2012 డీఎస్సీలో రద్దు చేశారు. 12 ఏళ్ల తరువాత మళ్లీ అప్రెంటీస్ విధానం అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. దీన్ని పునరుద్ధరించడంపై నిరుద్యోగులు, ఉపాధ్యాయ సంఘాలు మండి పడుతున్నాయి.

● కొరవడిన స్పష్టత

డీఎస్సీ ప్రకటనకు ముందుగానే ఖాళీల వివరాలు సేకరించాల్సిన విద్యాశాఖలో స్పష్టత కొరవడింది. నిర్దిష్టమైన తేదీలోపు ఎన్ని ఖాళీలు ఉన్నాయో సమగ్ర వివరాలను ప్రభుత్వం కోరలేదని అధికారులు చెపుతున్నారు. ఇప్పుడు హడావిడిగా జనవరి 31వతేదీ లోపు ఉద్యోగ విరమణ చేసినవారు, మృతుల వివరాలు సేకరించేందుకు కసరత్తు ప్రారంభించారు. ఈ ప్రక్రియ ఎప్పటికి పూర్తవుతుందో కూడా తెలియదని, ఎప్పటి నుంచి ఎప్పటి వరకు ఖాళీలు గుర్తించాలనే అంశంపై తర్జనభర్జన పడుతున్నట్లు వారు తెలిపారు. పాఠశాల విద్యాశాఖ రాష్ట్ర కార్యాలయంలో సమావేశం నిర్వహించిన తరువాత డీఎస్సీపై స్పష్టత వస్తుందని వారంటున్నారు. జిల్లాలో ఉపాధ్యాయ పోస్టులు తక్కువగానే ఉన్నట్లు విద్యాశాఖ వర్గాలు చెబుతుండగా, సమావేశం అనంతరం పోస్టుల సంఖ్య పెరగడం, తగ్గడంపై స్పష్టత వస్తుందంటున్నారు. తొలుత టెట్ నిర్వహించాలని విద్యాశాఖ భావిస్తుండగా, ముందు టెట్ నిర్వహిస్తారా లేక డీఎస్సీనే నిర్వహిస్తారనే విషయంపై కూడా స్పష్టత రావాల్సి ఉంది.


హక్కులు కాలరాస్తున్నారు..



ఎన్నో ఉద్యమాలు, సమ్మెల ద్వారా సాధించుకున్న అప్రెంటీస్ విధానం రద్దును ఈ ప్రభుత్వం తిరిగి తీసుకు రావడం తమ హక్కులు కాలరాయడమే. ఎవరూ అడగకుండానే పదవీ విరమణ వయసు పెంచడం ద్వారా నిరుద్యోగాన్ని పెంచి పోషిస్తున్న ప్రభుత్వం 35వేల టీచర్ పోస్టులకు కేవలం 6,100 పోస్టుల భర్తీకి ఆమోదం తెలపడం నిరుద్యోగులను మోసం చేయడమే.

- ఏ.సురేంద్రరెడ్డి, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు

బానిసత్వంలోకి నెట్టడమే..



ఉపాధ్యాయులు ఏళ్ల తరబడి పోరాటాలు చేసి రద్దు చేయించుకున్న అప్రెంటీస్ విధానాన్ని వైసీపీ ప్రభుత్వం పునరుద్ధరించాలని ఆలోచన చేయడం నిరుద్యోగులను బానిసత్వంలోకి నెట్టడమే. ఎన్నికల ముందు అబద్దాలు చెప్పి అధికారంలోకి వచ్చాక ఉపాధ్యాయ, ఉద్యోగులను వేధింపులే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుంది. తాజాగా ఎన్నికల స్టంట్‌గా డీఎస్సీ నోటిఫికేషన్ ప్రకటించింది. ప్రభుత్వం పునరాలోచించి, అప్రెంటీస్ విధానాన్న రద్దు చేయాలి.

- మాసా ప్రసాద్, బీటీఏ జిల్లా ప్రధాన కార్యదర్శి



జలదంకి పంచాయతీ లేదూటగంగమ్మ చెరువు గుంతల్లో నిలిచిన నీటిని ఆయిల్ ఇంజన్‌తో తరలించుకుంటున్న రైతులు

కావలి కాలువకు
నీటి విడుదల కుదింపు!

- చినక్రాక బ్యాలెన్సింగ్ రిజర్వాయరుకు చేరని నీరు
- ఎండుతున్న పంటలు • రైతులకు తప్పని ఇక్కట్లు

జలదంకి, ఫిబ్రవరి 4: అధికారుల తీరుతో సాగునీటి ఎద్దడి ఏర్పడి పంటలు ఎండు ముఖం పడుతున్నాయి. నిర్ణయించిన మేరకు కావలి కాలువకు నీటిని విడుదల చేయకుండా సంగం ఆనకట్ట వద్ద కుదించడంతో చినక్రాక బ్యాలెన్సింగ్ రిజర్వాయరుకు చుక్కనీరు చేరడం లేదు. వివరాల మేరకు.. కావలి కాలువకు సంగం ఆనకట్ట వద్ద 500 క్యూసెక్కుల సోమశిల జలాలు విడుదల చేయాలని నిర్ణయించారు. అయితే శనివారం 350 క్యూసెక్కులకు తగ్గించేశారు. దీంతో కావలి కాలువ పరిధిలోని ఎస్వీపాలెం గేట్ల వద్దకు 180 క్యూసెక్కులే చేరుతున్నాయి. ఇందులో 100 క్యూసెక్కులు ఎస్వీపాలెం మేజరుకు విడుదల చేస్తూ మిగిలిన 80 క్యూసెక్కులు కావలి కాలువ దిగువకు వదులుతున్నారు. ఈ నీరు మోటార్లతో తోడేస్తుండడంతో బోయలపాడు వద్దకే సరిపోతున్నాయి. ఈ క్రమంలో హనుమకొండపాలెం మేజర్, చినక్రాక రిజర్వాయర్లకు రెండు రోజుల నుంచి చుక్కనీరు రావడం లేదు. చినక్రాక రిజర్వాయరులోని మూడు తూములకు నీరు అందక కింది ఆయకట్టు భూములకు సాగునీరు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఐఏబీలో కావలి కాలువకు 3 టీఎంసీల నీరు కేటాయించారు. ఈ నీటిని ఎస్వీ పాలెం వరకు కేటాయిస్తూ తీర్మానం చేశారు. రైతుల వినతి మేరకు మరో టీఎంసీ నీరు కేటాయిస్తూ సీబీఆర్ వరకు పొడిగించి వరి పంటకు ఇబ్బందులు లేకుండా ప్రణాళికలు రూపొందించారు. అందులో భాగంగా ఎస్వీపాలెం గేట్ల వద్ద నుంచి కావలికాలువ దిగువకు జనవరిలో 100, ఫిబ్రవరిలో 150, మార్చిలో 100 క్యూసెక్కుల వంతున సాగునీరు సీబీఆర్‌కు విడుదల చేసేలా నిర్ణయించారు. ఇదిలా ఉండగా గత నెల 26న జిల్లా కలెక్టర్, కావలి ఎమ్మెల్యే, ఉదయగిరి వైసీపీ ఇంచార్జి, ఇద్దరు ఎస్ఈలు, రైతులు, తదితరులతో సమావేశమై గత నెల 29 నుంచి సంగం ఆనకట్ట వద్ద కావలి కాలువకు 500 క్యూసెక్కుల విడుదల చేయాలని అధికారులను ఆదేశించారు. అయితే వారం రోజుల్లోనే 350 క్యూసెక్కులకు తగ్గించేశారు. దీంతో దిగువ ప్రాంతమైన జలదంకి మండలానికి సోమశిల జలాలు చేరడం లేదు. ఈ క్రమంలో సాటునీటి కోసం గుంతల్లో నిలిచిన నీటిని ఇంజన్లతో తరలించేందుకు రైతులు అవస్థలు పడుతున్నారు.

ఆమరణ దీక్ష చేస్తా



కావలి కాలువకు వచ్చే సోమశిల జలాలు అకస్మాత్తుగా తగ్గించడం దారుణం. దీనివల్ల మండల రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతుంది. తక్షణం సంగం వద్ద 600 క్యూసెక్కులకు పెంచి సాగునీరు అందించాలి. లేనిపక్షంలో ఈనెల 7వ తేదీ నుంచి చినక్రాక చెరువు వద్ద రైతులతో కలిసి ఆమరణ దీక్ష చేస్తా.

- కరియావుల అప్పలయ్యనాయుడు, రైతు, కమ్మవారిపాలెం

రైతులను ఇబ్బందులు పెడుతున్నారు



కావలి కాలువకు నీటి విడుదల విషయంలో రోజుకో విధంగా అధికారులు వ్యవహరిస్తూ రైతులను ఇబ్బందులు పెడుతున్నారు. ఐఏబీలో ఒకవిధంగా, కలెక్టర్ దగ్గర జరిగిన చర్చల్లో మరోవిధంగా, మంత్రి వద్ద జరిగిన చర్చలు ఇంకోవిధంగా ఉన్నాయి. ఇవన్నీ కాదని సగం ఆనకట్ట వద్ద నీటి విడుదలను తగ్గించడం దారుణం.

- వంటేరు జయచంద్రారెడ్డి, సోమశిల ప్రాజెక్ట్ మాజీ ఉపాధ్యక్షుడు

వింత వ్యాధితో బాయిలర్ కోళ్ల మృతి

- ఆందోళనలో పెంపకందారులు

పొదలకూరు, ఫిబ్రవరి 4 : వింత వ్యాధితో బాయిలర్ కోళ్లు మృతి చెందుతుండడంతో మండలంలో పెంపకదారులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని పార్లపల్లి, రత్నగిరి, చాటగొట్ల, మరుపూరు, మహమ్మదాపురం, వెలికంటిపాలెం గ్రామాల్లో సుమారు 60వేల కోళ్ల వరకు పాడి రైతులు పెంచుతున్నారు. గత పది రోజులుగా కోళ్లకు వింత వైరస్ సోకిందని, గురక శబ్దం చేస్తూ, రెక్కలు గట్టిగా కొటుకుంటూ చనిపోతున్నాయని పెంపకందారులు వాపోతున్నారు. చనిపోయిన కోళ్లను పొదలకూరు వెటర్నరీ ఆసుపత్రికి తీసుకెళ్లి పరీక్షించి, మందులు వాడినా ప్రయోజనం లేకుండా పోతోందని, ఈమధ్య కాలంలోనే సుమారు 10వేల కోళ్లు చనిపోయాయని ఆయా రైతులు తెలిపారు. రెండు నుంచి రెండున్నర కేజీ వరకు పెరిగిన కోళ్లు ఇలా చనిపోవడంతో ఆర్థికంగా నష్టపోతున్నామన్నారు. ప్రభుత్వం, ఉన్నతాధికారులు కోళ్ల ఫారాలను పరిశీలించి, వైరస్ నివారణ చర్యలు చేపట్టాలని, అలాగే నష్టపోయిన రైతులను ఆదుకోవాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు. కాగా, గత నాలుగు రోజుల్లోనే బాయిలర్ కోళ్ల ఫారంలో 3వేల కోళ్లకు గాను 20 కోళ్లు మాత్రమే మిగిలాయని, ఆదివారం ఒక్కరోజే 1200 కోళ్లు చనిపోయాయని మహమ్మదాపురం కోళ్లఫారం రైతు నాయబ్ రసూల్ వాపోయాడు.



వైరస్ చనిపోయిన బ్రాయిలర్ కోళ్లు



కోళ్ల పెంపకందారుడు నాయబ్‌రసూల్

ఒరిగిపోయిన ఇసుక టిప్పర్

- త్రుటిలో తప్పిన ప్రమాదం

చేజర్ల, ఫిబ్రవరి 4: ఇంటి నిర్మాణం కోసం టిప్పర్‌లో వచ్చిన ఇసుక అన్‌లోడ్ చేసే క్రమంలో ఓ వ్యక్తి ప్రాణాపాయం నుంచి త్రుటిలో తప్పించుకున్న సంఘటన మండలంలోని ఆదరుపల్లిలో ఆదివారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. ప్రత్యక్ష సాక్షుల వివరాల మేరకు.. ఇసుకను అన్‌లోడ్ చేసే క్రమంలో వెనుకకు వెళుతున్న టిప్పర్ రోడ్డు పక్కనే తవ్వి ఉన్న మ్యాన్‌హోల్ వద్ద ఒరిగిపోయింది. ఈక్రమంలో అందులోని ఇసుక కిందపడిపోయింది. అయితే కింద పడిపోయిన ఇసుక కింద ఓ వ్యక్తి ఉండడాన్ని కొద్దిసేపటి తర్వాత స్థానికులు గుర్తించి వెంటనే అతనిని బయటకు తీశారు. అతని పరిస్థితి నిలకడగా ఉండడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.



పక్కకు ఒరిగిపోయిన ఇసుక టిప్పర్

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	133
లేయర్ లైవ్	85
స్కిన్ చికెన్	236
స్కిన్‌లెస్	262
లేయర్	145

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 5994
వెండి కిలో ధర	రూ. 73,000
వెండి ఒక గ్రాము	రూ. 75.00

నిత్య పెళ్లికొడుకుని అరెస్టు చేయాలి

నెల్లూరు (సాంస్కృతికం): నెల్లూరులోని ప్రభుత్వ ప్రధాన వైద్యశాలలో పనిచేసే షబ్బీర్ అహ్మద్ అనే వ్యక్తి తనను మోసం చేశాడని ఓ మహిళ ఆరోపించింది. ఆదివారం నగరంలోని నెల్లూరు జర్నలిస్టు భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడింది. పెళ్లయి, భర్త చనిపోయిన తనను షబ్బీర్ పెళ్లి చేసుకున్నాడని, అయితే అప్పటికే అతనికి పెళ్లయిందని చెప్పింది. ఈ విషయం తెలిసి అతనిని దూరం పెట్టానని, అప్పటి నుంచి తన నగ్న ఫొటోలతో బ్లాక్‌మెయిల్ చేస్తున్నాడని ఆరోపించింది. తనతోనే కాకుండా మరికొంత మంది అమ్మాయిలతో కూడా సంబంధాలు నెరుపుతూ వారిని కూడా వేధిస్తున్నాడని బాధితురాలు తెలిపింది. షబ్బీర్‌పై 6వ నగర పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని, అయితే పోలీసులు కేసు నమోదు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వాపోయింది. నిత్యపెళ్లికొడుకు అయిన షబ్బీర్‌అహ్మద్‌ను అరెస్టు చేసి, తనలాంటి వారికి న్యాయం చేయాలని ఆమె డిమాండ్ చేసింది.

ప్రభుత్వ భూమా... పాతేయ్ జెండా !

- రాపూరు మండలం పంగిలిలో భూకబ్జాకు యత్నం • 100 ఎకరాలను చదును చేసిన అక్రమార్కులు

నెల్లూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఖాళీగా భూమి కనిపిస్తే కబ్జాదారులు వాలిపోతున్నారు. మనకు అడ్డేముంది.. అన్న రీతిలో ప్రభుత్వ భూములను స్వాహా చేస్తున్నారు. రాపూరు మండలం పంగలి తుర్రావారి పాలెంలో ప్రభుత్వ భూమిని స్వాహా చేసేందుకు ప్రయత్నాలు జరుగుతు న్నాయి. సర్వే నంబరు 136లో 988.47 ఎకరాల ప్రభుత్వ భూమి ఉండగా, దానిపై కొందరు అక్రమార్కుల కన్ను పడింది. గత కొద్ది రోజులుగా ఈ భూమిని చదును చేస్తున్నారు. ఇప్పటికే సుమారు వంద ఎకరాల్లో పిచ్చి మొక్కలను తొలగించి చదును చేశారు. ఈ భూమిని తెలంగాణ, కర్ణాటక ప్రాంతాలకు చెందిన వ్యక్తులకు తక్కువ ధరకు విక్రయించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది.



రాపూరు మండలం పంగిలి గ్రామంలో చదును చేసిన ప్రభుత్వ భూములు

• అనధికార విక్రయాలు

పంగలి గ్రామంలో వేల ఎకరాల భూములను ల్యాండ్ సీలింగ్ కింద ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. అయితే చాలా భూములను పేదలకు పంచలేదు. ఎవరైతే ల్యాండ్ సీలింగ్ కింద భూమి ఇచ్చారో, వారి వారసులు ఇప్పుడు ఆ భూమి తమదంటూ చెప్పుకుంటూ వస్తున్నారు. ఆ క్రమంలో అనధికారికంగా విక్రయాలు జరుపుతున్నట్లు స్థానికంగా చెప్పుకుంటున్నారు. గతంలో ఇదే మాదిరిగా ఈ భూములను ఆక్రమించేందుకు పలువురు ప్రయత్నించారు. కానీ అప్పట్లో అధికారులు వారి ప్రయత్నాలను అడ్డుకున్నారు. ఆ భూముల్లోకి ఎవరూ ప్రవేశించేందుకు వీల్లేదని 144 సెక్షన్‌ను కూడా విధించారు. కానీ ఇటీవల మళ్లీ ఆక్రమణకు కుట్రలు మొదలయ్యాయి. ఆ క్రమంలోనే భూమిని చదును చేయడం ప్రారంభించారు. ఈ ఆక్రమణల వెనుక వైసీపీ నాయకుల హస్తం ఉన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే ప్రభుత్వ భూముల్లో యథేచ్ఛగా ఆక్రమణలు జరుగుతున్నా రెవెన్యూ అధికారులు మాత్రం స్పందించకపోవడం విమర్శలకు తావిస్తోంది.

టీడీపీ పార్లమెంట్ కమిటీలో కావలి వాసులు ముగ్గురికి చోటు

కావలి, ఫిబ్రవరి 4: టీడీపీ నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ కమిటీలో కావలి నియోజకవర్గానికి చెందిన ముగ్గురికి చోటు లభించింది. టీడీపీ నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడిగా అల్లూరు మండలంకు చెందిన బీద గిరిధర్ యాదవ్, కార్యదర్శిగా కావలి పట్టణానికి చెందిన మంచాల ప్రసాద్, రైతు విభాగం ఉపాధ్యక్షుడిగా అల్లూరుకు చెందిన బుల్లా కృష్ణారెడ్డిలను నియమించారు. ఈ మేరకు నెల్లూరు పార్లమెంట్ అధ్యక్షుడు షేక్ అబ్దుల్ అజీజ్ ఉత్తర్వులిచ్చారు. దీంతో తెలుగుదేశం పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. వారికి పార్టీ శ్రేణులు అభినందనలు తెలియజేశారు.



బీద గిరిధర్

ఇంటర్ పరీక్ష ఫీజు గడువు పొడిగింపు

నెల్లూరు (విద్య), ఫిబ్రవరి 4 : ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు సంబంధించిన పరీక్ష ఫీజు గడువును పొడిగించినట్లు ఆర్ఐవో డాక్టర్ ఏ శ్రీనివాసులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మార్చి నెలలో జరిగే ఇంటర్ పరీక్షలకు ఇప్పటి వరకు ఫీజు చెల్లించని వారు తత్కాల్ పథకం కింద రూ.3వేల అపరాధ రుసుముతో ఈనెల 10వతేదీ సాయంత్రం 5 గంటలలోపు సంబంధిత కళాశాలల్లో చెల్లించాలన్నారు. ఇంటర్‌బోర్డు కల్పించిన ఈ తుది అవకాశాన్ని విద్యార్థులు సద్వి నియోగం చేసుకుని పబ్లిక్ పరీక్షలకు హాజరు కావాలని సూచించారు.

ఓటర్ల జాబితాలో తొలగని తప్పులు

అనంతసాగరం, ఫిబ్రవరి 4: కొత్తగా విడుదల చేసిన ఓటర్ల జాబితాలో తప్పులు యథాతథంగా ఉన్నాయి. పలుమార్లు అధికారులు ఓటర్ల జాబితాపై సర్వేలు చేసి సవరణలు చేసినా మృతుల ఓట్లు కొత్త జాబితాలో ఉండడం విస్మయానికి గురిచేస్తోంది. మండల కేంద్రం అనంతసాగరంలో 54, 55, 56, 57 పోలింగ్ బూత్‌లు ఉండగా అందులో మృతుల ఓట్లు 19 వరకు ఉన్నట్లు స్థానికులు గుర్తించారు. రెండేళ్ల క్రితం మృతిచెందిన వారి పేర్లు, ఫోటోలు సైతం జాబి తాల్లో దర్శనమిస్తుండడంతో విమర్శలు వ్యక్తమవుతు న్నాయి. ఇకనైనా తప్పులు సరిచేస్తారా..లేదా.. ? అనే సందేహం వ్యక్తమవుతోంది. మృతుల ఓట్లు అలాగే ఉంటే వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వారిపేరిట దొంగ ఓట్లు పోలయ్యే అవకాశం ఉంటుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



ఓటర్ల జాబితాలో తొలగని మృతుల ఫొటోలు

కోడికత్తి శ్రీను విడుదలకు గవర్నర్ జోక్యం చేసుకోవాలి

- దళిత సంఘర్షణ సమితి ఆధ్వర్యంలో ధర్నా

బిట్రగుంట, ఫిబ్రవరి 4: కోడికత్తి శ్రీను విషయంలో గవర్నర్ జోక్యం చేసుకుని విడుదల చేయించాలని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్.మల్లి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం బోగోలు బజారు కూడలోని అంబేద్కర్ విగ్రహం వద్ద దళిత సంఘర్షణ సమితి ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు జగన్‌మోహన్‌రెడ్డిపై దాడి చేశారని ఐ దేళ్లుగా శ్రీనును జైలులో పెట్టించారన్నారు. శ్రీను బయటకు వస్తే అసలు డ్రామా బయట పడుతుందని బెయిల్ ఇవ్వకుండా చేస్తున్నారని దుయ్యబట్టారు. జైలులో కోడికత్తి శ్రీనుపై హత్యాయత్నాలు జరుగుతున్నాయని, ఈ విషయంలో గవర్నర్ చొరవ తీసుకుని రక్షణ కల్పించడంతోపాటు విడుదల చేయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దళిత, గిరిజన నేతలు సాదుప్రసాద్, ఆత్మకూరు తేజ, పత్రి రవికుమార్, బత్తిన ఆనందం, చౌటూరి లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా చేస్తున్న దళిత సంఘాల నేతలు

సర్వర్ పని చేయక
జగనన్న ఇళ్ల స్థలాల లబ్ధిదారుల ఇక్కట్లు

ఉదయగిరి, ఫిబ్రవరి 4: సర్వర్ పనిచేయక జగనన్న ఇళ్ల స్థలాల లబ్ధిదారులు ఉదయగిరి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట మండుటెండలో వేచి ఉండాల్సిన దుస్థితి నెలకొంది. ఆదివారం జగనన్న లేఅవుట్‌లో పట్టాలు పొందిన లబ్ధిదారులకు ప్రభుత్వం రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపట్టింది. అందులో భాగంగా మర్రిపాడుతోపాటు మండలంలోని గన్నేపల్లి, కొట్టాలపల్లి గ్రామాల లబ్ధిదారుల ను సచివాలయ సిబ్బంది తీసుకువచ్చారు. సర్వర్ పనిచేయకపోవడంతో వారు గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చింది.



సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట వేచి ఉన్న లబ్ధిదారులు

పొదలకూరు : స్థానిక రిజిస్ట్రార్ కార్యాలయంలో ఆదివారం సర్వర్ పని చేయక పోవడంతో మండలంలోని జగనన్న ఇళ్ల స్థలాల లబ్ధిదారులు ఇబ్బందులు పడ్డారు. ఇళ్లల్లో పనులు ఆపుకుని కార్యాలయాల వద్ద పడిగాపులు కాశారు. సర్వర్ అందుబాటులోకి రాగానే తామే ఒక్కొక్కరిని పిలుస్తామని అధికారులు చెప్పినా తాము వెళ్తే మరలా పనికాదేమోనని లబ్ధిదారులు కార్యాలయాల వద్దనే ఉండిపోయారు.

చేనేతలే గెలుపును నిర్ణయిస్తారు !

- చేనేత కులాల విజయభేరిలో వక్తలు

నెల్లూరు(వ్యవసాయం), ఫిబ్రవరి 4 : రాష్ట్రంలో 55 లక్షల మంది చేనేత జనాభా ఉన్నారని, కొన్ని నియోజకవర్గాల్లో ఎన్నికల్లో గెలుపు, ఓటములను చేనేతలే నిర్ణయిస్తారని కర్నూలు పార్లమెంటు నియోజకవర్గ సభ్యుడు డాక్టర్ సింగిరి సంజయ్‌కుమార్, మాజీ ఎమ్మెల్సీ బూదాటి రాధాకృష్ణయ్య, గ్రంథాలయ సంస్థ చైర్మన్ దొంతు శారద, ఎంజీ బ్రదర్స్ అధినేత గంగాధర్ పేర్కొన్నారు. ఆదివారం నెల్లూరులోని మైపాడు రోడ్డులోగల డీజీపీ కల్యాణ మండపంలో చేనేత ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో చేనేత కులాల విజయభేరి సభ జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో 11 మంది గెలుపొందేలా రాజకీయ పార్టీలు చేనేతలకు సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. కమిటీ జిల్లా అధ్యక్షుడు బుధవరపు బాలాజీ మాట్లాడుతూ తమకు గౌవరం, గుర్తింపు ఇచ్చే పార్టీలకే సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ఈ సభ సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. కమిటీ కార్యదర్శి ఆశం సురేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ గోపాల్, ఉపాధ్యక్షుడు మల్లికార్జున, కార్యదర్శి రామనాథం రాజశేఖర్, సహాయ కార్యదర్శి మార్కాపురం లక్ష్మీనారాయణ, పద్మశాలి సంఘం అధ్యక్షుడు గుత్తికొండ శ్రీనివాసులు, దేవాంగ సంఘం అధ్యక్షుడు సతీష్, చేనేత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ప్రభాకర్, రాష్ట్ర ఇంజనీర్స్ సంఘం అధ్యక్షుడు చేవూరు శ్రీనివాసులు పాల్గొన్నారు.



ర్యాలీలో చేనేత సంఘ నాయకులు

నేను సచ్చీలుడనని సీబీఐ తేల్చింది..!

- చంద్రబాబు కూడా నిరూపించుకోవాలి : కాకాణి



నెల్లూరు(హరనాథపురం), ఫిబ్రవరి 4 : నేను సచ్చీలుడనని సీబీఐ తేల్చిందని రాష్ట్ర వ్యవసాయశాఖామంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చెప్పారు. నెల్లూరులోని తన క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తాను సచ్చీలుడనని సీబీఐ తేల్చిందని, చంద్రబాబు నాయుడు కూడా తన సచ్చీలతను నిరూపించుకోవాలని కోరారు. తండ్రీకొడుకులు రెండేళ్లుగా నాపై చేసిన ఆరోపణలకు ఇప్పుడు ఏమి సమాధానం చెపుతారని ప్రశ్నించారు. చంద్రబాబు నిజంగా నీతి మంతుడైతే అతనిపై ఉన్న ఏ ఒక్క కేసులోనైనా సీబీఐ విచారణ కోరాలన్నారు. నెల్లూరు కోర్టులో జరిగిన దొంగతనంపై సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తనపై పెట్టిన కేసులో వాస్తవాలు వెలుగులోకి వచ్చాయన్నారు. ఆనాడే తనకు సంబంధం లేదని స్పష్టం చేశానన్నారు. హైకోర్టు ఈ కేసును సుమోటోగా తేల్చిందన్నారు. అందరితో పాటు తనకు కూడా నోటీసులు ఇచ్చిందని కాకాణి చెప్పారు. సీబీఐకి అప్పగించడానికి మీకేమైనా అభ్యంతరాలు ఉన్నాయా అని అడిగిందన్నారు. చాలా మంది నేను ప్రతిఘటిస్తానని అనుకున్నారన్నారు. నోటీసు ఇచ్చిన రోజే సీబీఐ విచారణకు సిద్ధంగా ఉన్నామని చెప్పామని అన్నారు. సోమిరెడ్డిని తాను పెద్దగా పట్టించుకోనని, పద్నాలుగేళ్లుగా ముఖ్యమంత్రిగా చేసిన చంద్రబాబు తనపై నిందలు వేస్తూ అనేక బహిరంగ సభల్లో మాట్లాడారన్నారు. బురద చల్లేద్దాం అతనే కడుక్కుంటాడు.. అన్నట్టుగా మాట్లాడిన చంద్రబాబు లాంటి వారి మాటలకు విలువ ఉందా ? అని ప్రశ్నించారు. ఇన్నర్ రింగ్ రోడ్డు నుంచి స్కిల్ కేసు, ఇన్‌సైడర్ ట్రేడింగ్, మద్యం కుంభకోణం వంటి వాటిలో నీపాత్ర లేదా.. వాటిపై సీబీఐ విచారణకు సిద్ధమా? అని చంద్రబాబును ప్రశ్నించారు. లోకేష్ తనను కోర్టు దొంగ అని మాట్లాడారన్నారు. ఈ రోజు నా పాత్ర లేదని తేలిందని, చంద్రబాబు, లోకేష్ ఏమి సమాధానం చెపతారని ప్రశ్నించారు.

ఉత్సాహంగా మాస్టర్స్ బ్యాడ్మింటన్ పోటీలు

నెల్లూరు (విద్య), ఫిబ్రవరి 4 : జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెల్లూరు లోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ఆదివారం నిర్వహించిన జిల్లాస్థాయి మాస్టర్స్ బ్యాడ్మింటన్ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. 35 నుంచి 75 సంవత్సరాల పైబడి విభాగాల వరకు పురుషులు, మహిళలు వేర్వేరుగా తలపడ్డారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నిమ్మల వీర వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జిల్లాస్థాయి పోటీలు ఆసక్తిగా జరిగాయని, విజేతలు రాజమండ్రిలో ఈనెల 16 నుంచి జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తార ని తెలిపారు. రాష్ట్ర పోటీల్లో కూడా పతకాలు సాధించి జిల్లా కీర్తిని ఇనుమడింప చేయాలని ఆకాంక్షించారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యుడు తాళ్లపాక వరప్రసాద్, కోచ్ వెంకటేష్, సిబ్బంది పాల్గొన్నారు.



విజేతలతో పోటీ నిర్వాహకులు

జిల్లా మాస్టర్స్ షటిల్ విజేతలుగా కావలి వాసులు



షటిల్ బ్యాడ్మింటన్ జిల్లా విజేతలు డాక్టర్ వెంకటేశ్వరబాబు, శ్రీనివాసులు రెడ్డి, సురేష్, హనుమంతరావు

కావలిటౌన్, ఫిబ్రవరి 4: జిల్లా మాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెల్లూరు ఏసీ సుబ్బారెడ్డి ఇండోర్ స్టేడియంలో శని, ఆదివారాల్లో జరిగిన జిల్లాస్థాయి మాస్టర్స్ షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో కావలి డీఆర్ ఇండోర్ స్టేడియం క్రీడాకారులు విజేతలుగా నిలిచారు. 45 ప్లస్ విభాగంలో ఎన్ సురేష్, హనుమంతరావు జట్టు విన్నర్‌గా నిలిచారు. 55 ప్లస్ విభాగంలో ప్రముఖ డెంటల్ వైద్యుడు వెంకటేశ్వరబాబు, శ్రీనివాసులురెడ్డి జట్టు విన్నర్‌గా నిలవగా 55 ప్లస్ సింగిల్స్ రన్నర్స్‌గా వెంకటేశ్వరబాబు నిలిచారు. వీరు ఈనెల 16 నుంచి 18 వరకు రాజమండ్రిలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధించారు. విశ్వోదయ రెక్టార్ దొడ్ల వినయ్‌కుమార్ రెడ్డి, డీఆర్ ఇండోర్ స్టేడియం క్రీడాకారులు, పీడీలు పలువురు విజేతలను అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

బిట్రగుంట, ఫిబ్రవరి 4: మండలంలోని నాగులవరం కూడలిలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు.. బోగోలు మండలం నాగులవరం పంచాయతీ దళితవాడకు చెందిన గంధం మధు (32) శనివారం రాత్రి సుమారు 9 గంటల సమయంలో నాగులవరం కూడలి నుంచి బైక్‌పై ఇంటి వెళుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొందా లేక బైకు అదుపుతప్పి పడిందో తెలియదు కానీ తీవ్ర గాయాలయ్యాయి. గుర్తించిన స్థానికులు క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం 108లో కావలికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. కావలి ఏరియా వైద్యశాల్లో మృతదేహానికి ఆదివారం పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడికి పదేళ్ల క్రితం వివాహం కాగా భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ ప్రమాదంపై పోలీసుల నుంచి ఎలాంటి సమాచారం అందలేదు.



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన గంధం మధు

జగన్‌కు బీసీలు గుణపాఠం చెప్పాలి : కురుగొండ్ల



బీసీ సదస్సులో మాట్లాడుతున్న కురుగొండ్ల రామకృష్ణ

కలువాయి, జనవరి 4 : బీసీలకు అన్యాయం చేసిన జగన్ ప్రభుత్వాన్ని గద్దె దించాలని వెంకటగిరి మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ పిలుపునిచ్చారు. కలువాయిలో ఆదివారం జరిగిన జయహో బీసీ సదస్సులో ఆయన మాట్లాడుతూ జగన్ పాలనలో బీసీలకు ఎలాంటి మంచి జరగలేదని, టీడీపీ హయాంలో అన్ని బీసీ కులాలకు సబ్సిడీ రుణాలు ఇచ్చి ఆదుకుందన్నారు. వైసీపీ ప్రభుత్వంలో బీసీలకు జరిగిన అన్యాయం గుర్తుపెట్టుకుని త్వరలో జరిగే ఎన్నికల్లో బీసీలంతా ఏకమై టీడీపీని గెలిపించి చంద్రబాబు నాయుడును సీఎం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొలిగర్ల మస్తాన్ యాదవ్ మాటాడుతూ వైసీపీ పాలనలో బీసీల ఆత్మగౌరవం దెబ్బతిందన్నారు. కులానికి ఒక కార్పొరేషన్ పెట్టి కేవలం వారిని కుర్చీలకే పరిమితం చేసి అవమానించిందన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ మునుస్వామి, తిరుపతి పార్లమెంటు బీసీ సెల్ అధ్యక్షుడు సదాశివం, మండల పార్టీ అధ్యక్షుడు జీ వెంకటేశ్వర్లు నాయుడు, జెన్ని రమణయ్య, ఏ వేణుగోపాల్‌రెడ్డి, ఏ మల్లికార్జునయ్య, చీపినాపి సర్పంచు పెంచలయ్య యాదవ్, సోమయ్య యాదవ్, జగదల్ నాయుడు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

వరికుంటపాడు, ఫిబ్రవరి 4: ఎన్నికల దృష్ట్యా గ్రామాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ తిరుపతయ్య సూచించారు. ఆదివారం రాత్రి తూర్పు బోయమడగల బస్టాండ్ సెంటర్, ప్రధాన కూడళ్లల్లో ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామాల్లో కొత్త వ్యక్తుల సంచారంపై సమాచారం ఇవ్వాలన్నారు. మద్యం విక్రయించినా, జూదస్థావరాలు నిర్వహించినా చట్టారీత్యా చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. ఆయన వెంట హెడ్ కానిస్టేబుల్ నారాయణ సిబ్బంది తదితరులున్నారు.

మాతమ్మకు పాల పొంగళ్లు

కలువాయి, జనవరి 4: కలువాయిలోని అరుంధతీయ కాలనీలోని మాతమ్మ, పోతురాజులకు ఆదివారం పాల పొంగళ్లు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కాలనీ వాసులు మేళతాళాలతో పూజా సామాగ్రితో ఆలయానికి చేరుకుని అమ్మవారికి పొంగళ్లు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

బండదేవరకు ప్రత్యేక పూజలు

అనంతసాగరం, ఫిబ్రవరి 4: మండల కేంద్రం అనంతసాగరంలో ఆదివారం రజకులు తమ కులదైవం బండదేవరకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మేళ తాళాలతో ఊరేగింపుగా కాలువ వద్దకు చేరుకొని బండదేవరకు పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

ఆత్మకూరు జోన్-4 ఇన్‌చార్జిగా వేలూరు కేశవ చౌదరి



వేలూరు కేశవచౌదరిని సన్మానిస్తున్న ఓబులాయపల్లి టీడీపీ నాయకులు శివ తదితరులు

చేజర్ల, ఫిబ్రవరి 4: ఆత్మకూరు నియోజకవర్గ జోన్-4 ఇన్‌చార్జిగా చేజర్ల మండల టీడీపీ సీనియర్ నాయకుడు, నాగులవెల్లటూరు గ్రామానికి చెందిన వేలూరు కేశవ చౌదరిని రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ప్రకటించింది. గత కొంత కాలంగా పార్టీకి చేస్తున్న సేవలు గుర్తించి, పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారికి పార్టీలో సముచిత స్థానం లభిస్తుందని తెలుగుదేశం పార్టీ నిరూపిం చుకుందని స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఆనం దం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాలు, పూల మాలలతో పలువురు అభినందించారు.

నేడు, రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సీతారామపురం, ఫిబ్రవరి 4: ఉదయగిరి నుంచి సీతారామపురం వరకు జరుగుతున్న జాతీయ రహదారి ఎన్‌హెచ్ 167-బి పనులలో భాగంగా సీతారామపురం మండలంలోని 33/11 కేవి విద్యుత్ సరఫరా సోమవారం, మంగళవారం మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు నిలిపివేయడం జరుగుతుందని మండల విద్యుత్ శాఖ ఏఇ శ్రీహరి ఒక ప్రకటనలో తెలిపారు. మండల విద్యుత్ వినియోగదారులు రెండు రోజులు విద్యుత్ శాఖ వారికి సహకరించాలని కోరారు.

టాలెంట్ టెస్ట్‌లో ఆత్మకూరు విద్యార్థుల ప్రతిభ



మెమోంటోలను అందుకుంటున్న విద్యార్థులు

ఆత్మకూరు, ఫిబ్రవరి 4: అపస్మా ఆధ్వర్యంలో జిల్లాస్థాయిలో నిర్వహించిన మనోహర్‌రెడ్డి మెమోరియల్ టాలెంట్ టెస్ట్‌లో అనంతసాగరం శాంతినికేతన్ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభను చాటుకున్నారు. షేక్ అహ్మద్ అక్మల్, ఎస్‌డి మాహిర్ జిల్లా స్థాయిలో ద్వితీ స్థానాలను కైవసం చేసుకున్నారు. ఈసందర్భంగా వారిని కరస్పాండెంట్ జి ప్రభాకర్, ప్రధానోపాధ్యాయురాలు భువనేశ్వరి, ఉపాధ్యాయులు అభినందించారు.

క్రమశిక్షణతో చదివితే విజయం తథ్యం



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఐఎఫ్ఎస్ అధికారి బడుగు శ్రీనివాసులురెడ్డి

ఆత్మకూరు, ఫిబ్రవరి 4: విద్యతోనే ప్రగతి సాధ్యమని, క్రమ శిక్షణతో చదువుకుంటే విజయం తథ్యమని పదవ తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులను ఉద్దేశించి ఐఎఫ్ఎస్ అధికారి బడుగు శ్రీనివాసులురెడ్డి, జిల్లా బీసీ సంక్షేమశాఖాధికారి వై వెంకటయ్య ఉద్బోధించారు. ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఆదివారం సహాయ బీసీ సంక్షేమశాఖ ఆత్మకూరు పరిధిలోని పదవ తరగతి విద్యార్థులకు ప్రేరణ, పునఃశ్చరణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా డీబీసీడబ్ల్యువో వై వెంకటయ్య మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులు నూరుశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ప్రణాళికను రూపొందించినట్లు తెలిపారు. అనంతరం పరీక్షల్లో 10కి 10పాయింట్లు ఎలా సాధించాలన్న దానిపై పలువురు ఉపాధ్యాయులు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆత్మకూరు బీసీ సహాయ సాంఘిక సంక్షేమశాఖ అధికారిణి మాట్లాడుతూ విద్యార్థులు ధైర్యంగా పరీక్షలు రాసేందుకు ప్రేరణ తరగతులు ఎంతో ఉపయోగపడతాయన్నారు. అనంతరం ఏబీసీడబ్ల్యువో ఎం శ్రీదేవి, బిఎస్ఆర్ జూనియర్ కళాశాల కరస్పాండెంట్ శ్రీనివాసులనాయుడు తమ సొంత నిధులతో అందజేసిన పరీక్షా సామాగ్రిని విద్యార్థులకు అందజేశారు. విధి నిర్వహణలో అంకితభావంతతో పనిచేసిన హాస్టల్ సంక్షేమాధికారులు (హెచ్‌డబ్ల్యువో)కు, హాస్టల్ సిబ్బందికి ప్రశంసాపత్రాలనే అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ రమణారెడ్డి, హాస్టల్ సంక్షేమశాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వారబందీ నిబంధనలు పాటించాలి : డీఈ



మాట్లాడుతున్న అధికారులు

సంగం, ఫిబ్రవరి 4: మోటార్ల కింద సాగు చేసే రైతులు వారబంది నిబంధనలు పాటించాలని బీపీఆర్ కాలువ డీఈ వెంకటరమణ సూచించారు. స్థానిక సోమశిల అతిథి గృహంలో బెజవాడ పాపిరెడ్డి కాలువ సెక్షన్ అధికారులు మోటార్ల కింద సాగుచేసే రైతులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈ మాట్లాడుతూ సోమశిల జలాశయంలో నీటి నిల్వలు తగ్గిపోతుండడంతోపాటు కాలువ కింద సాగు చేసిన విస్తీర్ణం అనుమతి కంటే పెరగడంతో నీటి కొరత ఏర్పడే పరిస్థితి నెలకొందని, నీటి కొరతను తగ్గించేందుకు నీటిని పొదుపుగా వాడుకోవాలని తెలిపారు. ఇందులో భాగంగా కాలువ పరిధిలో మోటార్ల ద్వారా సాగుచేసే రైతులు వారంలో సోమ, మంగళ, శుక్ర, శని వారం నాలుగు రోజులు మోటార్ల ద్వారా సాగునీరు తోడుకుని మిగిలిన బుధ, గురు, ఆదివారం మూడు రోజులపాటు మోటార్లను నిలిపివేయాలని సూచించారు. ఆ మూడు రోజులు అధికారిక ఆయకట్టు రైతులకు సాగునీటి సరఫరా జరుగుతుందని తెలిపారు. ఇందుకు మోటార్ల రైతులు అంగీకరించారు. ఈ కార్యక్రమంలో ఏఈ రమణయ్య, వ్యవసాయాధికారి శ్రీహరి, రైతులు పాల్గొన్నారు.

మొక్కుబడిగా వరికుంటపాడు మండల సమావేశం

వరికుంటపాడు, ఫిబ్రవరి 4: ప్రజా సమస్యల పరిష్కారం కోసం మూడు నెలలకోసారి నిర్వహించే మండల సర్వసభ్య సమావేశానికి కీలక శాఖల అధికారులు డుమ్మా కొడుతుండడంతో పీఏసీఎస్ అధ్యక్షుడు గుంటుపల్లి రామాంజనేయులు, ఎంపీడీవో శ్రీదేవి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో నిర్వహించిన మండల సమావేశంలో 18 శాఖలకు సంబంధించి అధికారులు హాజరు కావాల్సి ఉండగా కేవలం 8 శాఖల అధికారులే హాజరయ్యారు. అందులోనూ కిందిస్థాయి ఉద్యోగులు హాజరు కావడంతో ఆయా శాఖల పనితీరుపై అటు ప్రజాప్రతినిధులు, ఇటు అధికారులు సైతం విమర్శలు గుప్పించారు. ఆయా శాఖల అధికారులపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం మొక్కుబడిగానే సమావేశాన్ని కొనసాగించి చేతులు దులుపుకున్నారు. పీఆర్ ఏఈ నందకిశోర్ సచివాలయాలను పంచాయతీలకు అప్పగించామని చెప్పడంతో అక్కడే తూర్పురొంపిదొడ్ల పంచాయతీ కార్యదర్శి వెంకటకృష్ణయ్య అభ్యంతరం వ్యక్తం చేశారు. పూర్తిస్థాయిలో పనులు చేపట్టకుండా తమకు అప్పగించారని చెప్పడం ఏంటని నిలదీయంతో కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఆ సమయంలో ఎంపీడీవో సైతం ఆయన్ను మాట్లాడే అవకాశం ఇవ్వకపోవడంతో మౌనం వహించాల్సి వచ్చిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

రైతు, ప్రజా సమస్యలు పరిష్కరించాలి : సీపీఎం

ఉదయగిరి, ఫిబ్రవరి 4: మండలంలో రైతులు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి ఫరుద్దీన్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో ఆయన విలేఖరులతో మాట్లాడుతూ జాతీయ రహదారి నిర్మాణంలో ఇళ్లు, భూములు కోల్పోయిన వారికి వెంటనే నష్టపరిహారం చెల్లించాలన్నారు. పట్టణంలోని రంగనాయకుల ఆలయం నుంచి కోన కాలువ వరకు మురికి కాలువ నిర్మించాలన్నారు. పట్టణంలోని పలువీధుల్లో చెత్తకుండీలు ఏర్పాటు చేయడంతోపాటు రహదారుల వెంట ఏపుగా పెరిగిన కంపచెట్లను తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు గడ్డం నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రతిభ గల విద్యార్థులకు నగదు బహుమతులు : కంచి



కంచి పరమేశ్వరరెడ్డిని సన్మానించిన అపస్ నేతలు, ఉపాధ్యాయులు

ఆత్మకూరు, ఫిబ్రవరి 4: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే 10వ తరగతి విద్యార్థులలో పోటీతత్వం పెంచి, విలువలతో కూడిన విద్యను పెంపొందించే లక్ష్యంతో నగదు బహుమతులు అంద జేస్తామని సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కంచి పరమేశ్వరరెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక జిల్లా ప్రభుత్వ వైద్యశాల ఆవరణలోని నిత్యాన్నదాన భవనంలో పలువురు విద్యార్థులు, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 10వ తరగతి పరీక్షల్లో మండల స్థాయిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు రూ. 20 వేలు, రూ.15 వేలు, రూ. 10 వేల రూపాయలు అందిస్తామన్నారు. అదే క్రమంలో ప్రతి పాఠశాలలో 500 మార్కులు పైబడి సాధించిన ముగ్గురు విద్యార్థులకు రూ. 10,000, రూ. 7500, రూ. 5000 అందజేస్తామని తెలిపారు. ముందుగా కంచి పరమేశ్వరరెడ్డిని అపస్ నేతలు, పలువురు ఉపాధ్యాయులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ కుదుముల సుధాకర్‌రెడి, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు శేషారెడ్డి, యానాదిరెడ్డి, పలువురు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పంట కాలువల్లో పూడికతీత ప్రారంభం

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 4: మండలంలోని గండిపాళెం జలాశయం కుడి, ఎడమ ప్రధాన, ఉప కాలువల్లో జలవనరుల శాఖ అధికారులు పూడికతీత పనులు చేపట్టారు. ఈ సందర్భంగా డీఈ చంద్రమౌళి మాట్లాడుతూ జలాశయం పరిధిలో చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. అందులో భాగంగా ఉప కాలువల్లో ఏపుగా పెరిగిన చెట్లు, పూడికను తొలగిస్తున్నామన్నారు. మెట్ట పంటలను దృష్టిలో ఉంచుకొని విడుదల చేసి నీటిని ఆయకట్టుదారులు వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 4: త్వరలో ఎన్నికలు జరగనున్న దృష్ట్యా గ్రామాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనా రెడ్డి సూచించారు. ఆదివారం మండలం లోని జీ.చెరువుపల్లి పంచాయతీ ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో రాజకీయ కక్షలకు దూరంగా ఉంటూ స్నేహభావంతో మెలగాలన్నారు. అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మద్యం విక్రయాలు చేపట్టినా, జూద స్థావరాలు నిర్వహించినా, వివాదాలకు పాల్పడినా చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. కొత్త వ్యక్తుల సంచారంపై సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కావలి

కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి



కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఇంటూరి నాగేశ్వరరావు

టీడీపీ, జనసేన కూటమిదే అంతిమ విజయం

● 21వ వార్డులో 'బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ'

కందుకూరు, ఫిబ్రవరి 4: జగన్ ఎంతమంది ఎమ్మెల్యేలను ఎన్నిచోట్లకు మార్చి పంపినా ఉపయోగం లేదని రాబోయే ఎన్నికల్లో టీడీపీ, జనసేన కూటమి ఘన విజయం సాధించటం ఖాయమని టీడీపీ కందుకూరు నియోజకవర్గ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. పట్టణంలోని 21వ వార్డు కాళిదాసు వారి వీధి ప్రాంతంలో ఆదివారం బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. నాగేశ్వరరావుతో పాటు పార్టీ నాయకులు ఇంటింటికీ తిరుగుతూ మినీ మేనిఫెస్టోలో ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నాలుగున్నరేళ్లుగా స్థానిక ఎమ్మెల్యే ప్రజలకు అందుబాటులో లేడని, ఇష్టారీతిగా పింఛన్లు తీసేస్తున్నారని విమర్శించారు. విద్యుత్ బిల్లులను విపరీతంగా పెంచేసి ఆ బిల్లులను సాకుగా చూపి ప్రభుత్వ పథకాలు కట్ చేస్తున్నారని, ఇదెక్కడి న్యాయమని ప్రశ్నించారు. వైసీపీ నేతలు ఇసుక దర్జాగా అమ్ముకుంటుండగా సామాన్యులకు ఇసుక కొనుగోలు చేయడం తలకుమించిన భారంగా మారిపోయిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు దామా మల్లేశ్వరరావు, నార్నె రోశయ్య, ముచ్చు శ్రీను, పాకాల మల్లికార్జున, చిలకపాటి మధు, దాసరి సుబ్బరాయుడు, చల్లా మురళీకృష్ణ, నాదెళ్ల మధుబాబు, గుమ్మా శివ, సంగా వంశీ, శ్రీకాంత్, నటరాజ్, తదతరులు పాల్గొన్నారు.

కేన్సర్‌పై విద్యార్థినులకు అవగాహన



కేన్సర్‌ను జయించవచ్చని విక్టరీ సింబల్ చూపుతున్న వైద్యులు

కావలి, ఫిబ్రవరి 4: ప్రపంచ కేన్సర్ డే సందర్భంగా ఆదివారం ఇండియన్ మెడికల్ అసోసియేషన్ కావలి శాఖ, ఉమెన్ డాక్టర్స్ వింగ్, పింక్ హెల్త్ మిషన్ల ఆధ్వర్యంలో విద్యార్థులకు కేన్సర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కావలి పట్టణంలోని ప్రభుత్వ బీసీ కళాశాల బాలికల వసతి గృహం, బీసీ పాఠశాల బాలికల వసతి గృహం విద్యార్థులకు ఆయా వసతిగృహాలలో అవగాహన కల్పించారు. ఐఎంఏ కావలి శాఖ అధ్యక్షుడు కామంచి సుబ్బారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీనియర్ వైద్యుడు డాక్టర్ బెజవాడ రవికుమార్ కేన్సర్ వ్యాధిని ఆదిలోనే గుర్తించి తగిన వైద్యం అందిస్తే జయించవచ్చన్నారు. ఉమెన్ డాక్టర్స్ వింగ్ డాక్టర్లు ఉష, ఉషారాణి, పద్మజ, రాష్మి, రమ్య తదితరులు మహిళలకు సంభవించే కేన్సర్, తీసుకోవాల్సిన జగ్రాత్తలు గురించి వివరించారు. అనంతరం ఐఎంఏ కార్యదర్శి డాక్టర్ గోపి ఆర్థిక సహకారంతో 200 మంది విద్యార్థినులకు దుప్పట్లు పంపిణీ చేసి వారికి పోషకాహారం అందించారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ కార్యదర్శి డాక్టర్ గోపి, కోశాధికారి డాక్టర్ పాములూరు శివప్రసాద్, డాక్టర్లు వెంకటేష్, రేవంత్, భారతి, వసతిగృహ సంక్షేమాధికారులు విజయలక్ష్మి, నాగేశ్వరి, విశ్రాంత వార్డెన్ షేక్ ఖాదర్ బాషా, తదితరులు పాల్గొన్నారు.

రాబోయే రోజుల్లో కాబోయే సీఎం పవన్‌కల్యాణ్

● జనసేన రాష్ట్ర అధికార ప్రతినిధి కూనంపూడి శ్రీనివాసులు



కూనంపూడి శ్రీనివాసులును సత్కరిస్తున్న జనసేన కార్యకర్తలు

కావలిటౌన్, ఫిబ్రవరి 4: రాబోయే రోజుల్లో కాబోయే సీఎం పవన్‌కల్యాణ్ అని జనసేన పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కూనంపూడి శ్రీనివాసులు పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయాన్ని శ్రీనివాసులు సందర్శించారు. ఆయన మాట్లాడుతూ త్వరలో జరగబోయే వారాహి యాత్రను జయప్రదం చేయాలని, పవన్‌కల్యాణ్ ఆశయాలను ఆలోచనలను ప్రజల్లో విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు. జనసేన, టీడీపీ పొత్తును స్వాగతించాలని అదిష్టానం నిర్ణయం శిరోధార్యమవ్వాలని టీడీపీతో కలిసి పనిచేసేందుకు ప్రతి కార్యకర్త సిద్ధంగా ఉండాలని వైసీపీ అరాచకాలు దోపిడీని ఎండగట్టాలన్నారు. త్వరలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి అళహరి సుధాకర్ ఆధ్వర్యంలో నియోజకవర్గ నేతలు మంగళగిరిలోని రాష్ట్ర పార్టీ కార్యాలయంలో పవన్‌కల్యాణ్‌తో సమావేశం కానున్నానన్నారు. కార్యక్రమంలో రిషికేష్, ఆలా శ్రీనాథ్, టీ సుధీర్, బీ మస్తాన్, అగస్టీన్, కృష్ణయ్య, మంద శ్రీను, మనోజ్, ఫణి తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారుడికి సత్కారం



క్రీడాకారుడిని సత్కరిస్తున్న టీడీపీ నేత కావ్య క్రిష్ణారెడ్డి, తదితరులు

కావలి, ఫిబ్రవరి 4: ఢిల్లీలో ఈ నెల 2వ తేదీన జరిగిన ఐజీఎఫ్ నేషనల్ గేమ్స్‌లో ఎయిర్ రైఫిల్ 10 మీటర్ల విభాగంలో కావలి పట్టణం జండా చెట్టు సెంటర్‌కు చెందిన షేక్ హాస్సేన్ మొదిటి స్థానంలో నిలిచాడు. ఈ సందర్భంగా కావలి ముసునూరులోని టీడీపీ నేత కావ్యక్రిష్ణారెడ్డి ఇంటి వద్ద ఆదివారం జరిగిన కార్యక్రమంలో క్రీడాకారుడు హాస్సేన్‌ను ఆయన సత్కరించారు. భవిష్యత్తులో మరెన్ని మెడల్స్ సాధించి కావలికి, మీ తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని ఆయన కోరారు.

విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసుల పంపిణీ

బిట్రగుంట, ఫిబ్రవరి 4: బోగోలు మండలం జకేపల్లిగూడూరు పంచాయతీ కమ్మపాలెం అంగన్వాడీ కేంద్రంలోని చిన్నారులకు సీఆర్‌డబ్ల్యుడీఎస్ డైరెక్టర్ ఏగూరి టోనీజయకర్ తన తండ్రి ఏగూరి జాకబ్ జయంతి సందర్భంగా ఆదివారం ప్లేట్లు, గ్లాసులు, వాటర్ బాటిళ్లు, పండ్లు పంపిణీ చేశారు. చిన్నారులచే కేక్ కట్ చేయించి పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ సుధీర్, అంగన్వాడీ కార్యకర్త రమాభాయ్, తదితరులు పాల్గొన్నారు.

కందుకూరు బీజేపీ సమన్వయకర్తగా ఘట్టమనేని



బీజేపీ సమన్వయ సమావేశంలో నేతలు

కందుకూరు, ఫిబ్రవరి 4: కందుకూరు నియోజకవర్గ భారతీయ జనతా పార్టీ సమన్వయకర్తగా సీనియర్ నాయకుడు ఘట్టమనేని హరిబాబును నియమించారు. ఇప్పటి వరకు సమన్వయకర్తగా ఉన్న ఉన్నం నళినీదేవి ఇటీవల పార్టీకి రాజీనామా చేసి తెలుగుదేశం పార్టీ లో చేరిన విషయం విదితమే. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో బీజేపీ నెల్లూరు నేత గాజుల వెంకయ్యనాయుడు పాల్గొని పల్లెకుపోదాం కార్యక్రమం నిర్వహణపై చర్చించి విధివిధానాలు రూపొందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ సమన్వయకర్తగా నియమితులైన గట్టమనేని హరిబాబు నేతృత్వంలో పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలంతా కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు మారెళ్ల బ్రహ్మారెడ్డి, మన్నేపల్లి వరప్రసాదరావు, జొన్నాదుల రాఘవయ్య, మురళీధరన్, జగన్నాథం వైకుంఠం, మాటూరి రమేష్‌నాయుడు, ఎల్లంపల్లి శ్రీధర్, మువ్వల భూషయ్య, నవులూరి రాజేష్, గొడ్డలి బాలరాఘవులు, తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం.. యువత సామాజిక బాధ్యత



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న డాక్టరు నేరెళ్ల

కందుకూరు, ఫిబ్రవరి 4: రక్తదానం చేయడం యువత సామాజిక బాధ్యతగా తీసుకుని ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయాలని ప్రముఖ లాపరోస్కోపిక్ సర్జన్ డాక్టరు నేరెళ్ల ధర్మతేజ పేర్కొన్నారు. పొడపాటి చక్రీ తన సహచర సాఫ్ట్‌వేర్ ఉద్యోగులతో కలిసి ప్రారంభించిన భారతదేశ యువ సేవాసమితి ఆధ్వర్యంలో స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో ఆదివారం ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులతో పాటు యువకులు రక్తదానం చేశారు. సక్షమ్, రెడ్‌క్రాస్ సంస్థల సహకారంతో ఏర్పాటుచేసిన ఈ శిబిరంలో ఒంగోలు రెడ్‌క్రాస్ సొసైటీవారు రక్తసేకరణ చేశారు. కార్యక్రమంలో సేవాసమితి ప్రతినిధులు పేర్నమిట్ల సాయి, నవీన్, సమీర్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

లింగసముద్రం పోలీస్‌స్టేషన్‌లో సిబ్బంది కొరత !

లింగసముద్రం, ఫిబ్రవరి 4 : లింగసముద్రం పోలీసస్టేషన్‌లో సిబ్బంది కొరత వేధిస్తోంది.దీంతో పోలీస్‌స్టేషన్‌లో పరిధిలోని 16 గ్రామ పంచాయతీల్లోని ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా పోలీస్‌స్టేషన్‌లో ఒక ఎస్సై, ఒక ఏఎస్సై, ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లు, 12 మంది కానిస్టేబుళ్లు ఉండాలి. అయితే ప్రస్తుతం ఒక ఎస్సై, ఒక హెడ్ కానిస్టేబుల్, 9 మంది కానిస్టేబుళ్లు ఉన్నారు. వీరు కాక పోలీస్‌స్టేషన్‌లో నియమించిన ఒక మహిళా కానిస్టేబుల్ నెల్లూరు ఎస్సీ, ఎస్టీ సెల్ విభాగంలో, మరో హెడ్ కానిస్టేబుల్ విజయవాడలో డీజీపీ కార్యాలయంలో డిప్యూటేషన్‌పై పని చేస్తున్నట్లు తెలిసింది. ఉన్న 9 మంది కానిస్టేబుళ్లలో ఒకరు కోర్టుకు వెళ్లాల్సి ఉండగా మిగిలిన 8 మందిలో ముగ్గురు, నలుగురు బందోబస్తుకు వెళతారని తెలిసింది. దీంతో ఉన్న కొద్ది మంది సిబ్బందితో ఎస్సై పని చేస్తున్నారు. అంతేగాక మండలంలో జరిగే అసాంఘిక కార్యక్రమాల నివారణతో పాటు, ట్రాఫిక్‌ను పర్యవేక్షించాల్సి ఉంది. దీనికి తోడు ఎన్నికల సమయం కూడా వస్తోంది. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి సిబ్బంది, అధికారుల కొరతను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

రేపు కావలిలో ప్రత్యేక విద్యుత్ అదాలత్

కావలి, ఫిబ్రవరి 4: ఆంధ్రప్రదేశ్ దక్షిణప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఆధ్వర్యంలో విద్యుత్ వినియోగదారుల సమస్యలు పరిష్కారం కొరకు ప్రత్యేక విద్యుత్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు కావలి విద్యుత్‌శాఖ ఈఈ బెనర్జీ ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని వెంగళరావునగర్ ఉదయగిరి రోడ్డులోని విద్యుత్‌శాఖ ఈఈ కార్యాలయంలో మంగళవారం ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు ఈ కార్యక్రమం జరుగుతోందని పేర్కొన్నారు. ఈ విద్యుత్ అదాలత్‌లో చైర్మన్‌గా విశ్రాంత జడ్జి బీ.శ్రీనివాసాంజనేయ మూర్తి, ఆర్థిక సభ్యులు కే. రామమోహన్‌రావు, ఎస్ఎల్ అంజనీ కుమార్, జీ. ఈశ్వరమ్మలు పాల్గొని వినియోగదారుల సమస్యలకు పరిష్కారం చూపుతారని పేర్కొన్నారు. కావలి డివిజన్ పరిధిలోని కావలి, కలిగిరి, అల్లూరు సబ్‌డివిజన్లకు చెందిన విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

సమస్యలను తెలపండి.. పరిష్కరిస్తాం !

అల్లూరు, ఫిబ్రవరి 4 : సమస్యలను తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తామని పీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత పసుపులేటి సుధాకర్ సతీమణి సుగుణమ్మ అన్నారు. ఆదివారం సాయంత్రం ఆమె అల్లూరులోని చెర్లోసంఘం, ఆర్‌డీఆర్ కాలనీ, బీసీ కాలనీ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. స్థానికులను కలుసుకుని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తమ ట్రస్ట్ ద్వారా వీలైనన్ని సమస్యల్ని పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఆమె హామీ ఇచ్చారు. అదేవిధంగా అల్లూరులో పీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పసుపులేటి వెంకటేశ్వర్లు, ఎల్లు సాల్మన్‌రాజు, దర్శిగుంట వాసు, గుమ్మడి రాజేష్‌బాబు, ఎల్లు సుబ్రహ్మణ్యం, వల్లపు అనీల్, కాకాని రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

త్రైతసిద్ధాంత భగవద్గీత చదవండి



ప్రచార రథం వద్ద భగవద్గీతను ప్రదర్శిస్తున్న సురమౌళి, కమిటీ సభ్యులు

బిట్రగుంట, ఫిబ్రవరి 4: త్రైతసిద్ధాంత భగవద్గీతను ప్రతి ఒక్కరు చదివి కర్మ సిద్ధాంతం దైవీక జ్ఞానాన్ని పెంపొందిచుకోవాలని త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక నెల్లూరు కమిటీ అధ్యక్షుడు డి.సురమౌళి అన్నారు. బోగోలు మండలం బిట్రగుంట, బోగోలు పంచాయతీలో భగవద్గీత, నీతికథలు, యోగి వేమన పద్యా లు వాటి అర్థాల పుస్తకాలను ఆదివారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు ప్రదీప్, సుదర్శనమ్మ, అవినాష్, అన్నపూర్ణ, రఘురామయ్య, వేణు, ప్రవీణ, తదితరులు ఆల్గొన్నారు.

విద్యార్థినులకు పరీక్ష సామగ్రి పంపిణీ

కొండాపురం, ఫిబ్రవరి 4: కాంగ్రెస్ పార్టీ మండల మాజీ కన్వీనర్, సాయిపేట మాజీ సర్పంచు తాటికొండ రామమూర్తి జయంతి సందర్భంగా స్థానిక కస్తూర్బా గాంధీ విద్యాలయంలోని బాలికలకు ఆదివారం పరీక్ష సామగ్రిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన కుమారుడు లైఫ్‌లైన్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు నవీన్, ప్రాథమిక ఆరోగ్యకేంద్ర వైద్యాధికారి నసీరుద్దీన్, ఆర్ఎంపీ ఆర్.క్రిష్ణమోహన్, ఫౌండేషన్ సభ్యుడు ప్రవీణ్, ఉపాధ్యాయినులు చెంచులక్ష్మమ్మ, షబ్రీన్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినులకు పరీక్ష సామగ్రి అందిస్తున్న దాతలు

నేడు టీడీపీ బీసీ గర్జన మినీ మహాసభ

పొదలకూరు: టీడీపీ బీసీ గర్జన మహా సభను సోమవారం పొదలకూరులో నిర్వహిస్తున్నట్లు టీడీపీ మండల అధ్యక్షుడు తలచీరు మస్తాన్‌బాబు, పట్టణ అధ్యక్షుడు బొద్దులూరి మల్లికార్జున్‌నాయుడు తెలి పారు. పట్టణంలోని సంగంరోడ్డు కూడలి నుంచి గేట్ సెంటర్ లోని బోగోలు కృష్ణారెడ్డి కల్యాణ మండపం వరకు బైక్ ర్యాలీ నిర్వహిస్తామని, అనంతరం మినీ మహాసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని బీసీ నాయకులు, టీడీపీ కార్యకర్తలు, అభిమానులు తరలి రావాలని మండల బీసీ నాయకులు వెంపులూరు రామకృష్ణ, పల్లారపు కృష్ణయాదవ్, మద్దిరిళ్ల నరసింహులు, అరుణమ్మలు విజ్ఞప్తి చేశారు.

గాంధీ ఆశ్రమంలో సర్వమత ప్రార్థనలు

ఇందుకూరు పేట: మండలంలోని పినాకినీ సత్యాగ్రహ గాంధీ ఆశ్రమంలో కో కన్వీనర్ నెల్లూరు రవీంద్రరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం సర్వమత ప్రార్థనలు జరిగాయి. ఈ కార్యక్రమంలో ముందుగా గాంధీ ఆశ్రమ కమిటీ సభ్యులు బి.సుధారాణి, గంపల మంజులలు మహాత్మాగాంధీ, పొణక కనకమ్మ విగ్రహాలకు ఖాదీ వస్త్రాలు, నూలు మాలలు సమర్పించారు. కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో గాంధీ ఆశ్రమం కమిటీ సభ్యులు జీవీ రామిరెడ్డి, గణేశం సుమంత్‌రెడ్డి, షేక్.అల్లా బక్షు, వేణురెడ్డి, ఉపాధ్యాయులు, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఒక్క ఛాన్స్‌తో రాష్ట్రం సర్వనాశనం : సోమిరెడ్డి


టీడీపీలో చేరిన నాయకులతో మాజీ మంత్రి సోమిరెడ్డి

తోటపలి గూడూరు, ఫిబ్రవరి 4 : దుర్మార్గపు ప్రభుత్వానికి ఒక్కఛాన్స్ ఇస్తే రాష్ట్రం సర్వనాశనం అయిందని, మళ్లీ ఛాన్స్ ఇవ్వొద్దని మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ప్రజలను కోరారు. మండలంలోని మాచర్లవారి పాలెంలో ఆదివారం బాబు ష్యూరిటీ - భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. పొన్నులూరు శివకోటారెడ్డి ఆధ్వర్యంలో మండల అధ్యక్షుడు సన్నారెడ్డి సురేష్‌రెడ్డి అధ్యక్షతన ముందుగా 70 కుటుంబాలు వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. వారికి కండువాలు కప్పి సోమిరెడ్డి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ ప్రతి గ్రామానికి లింక్ రోడ్డు వేసిన ఘనత టీడీపీకే దక్కుతుందని, నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే తెలుగుదేశం పార్టీని గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొమ్మి సురేంద్ర, తూపిలి సుధాకర్‌రెడ్డి, అంతటి శ్రీనాథ్, షేక్ షఫి, షేక్ అల్లాబక్షు, కతారి వెంకటరమణయ్య, కతారి వెంకటశేషయ్య, దూపిరి చెత్తయ్య, చీకిరి వెంకటశేషయ్య, గోడ నాగార్జున, దూకిరి వెంకటరమణయ్య, వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

బీసీలను మోసం చేసిన జగన్‌రెడ్డి

● టీడీపీ కోవూరు ఇన్‌చార్జి పోలంరెడ్డి దినేష్‌రెడ్డి

విడవలూరు, ఫిబ్రవరి 4: ఎన్నికలకు ముందు బీసీలకు న్యాయం చేస్తానని చెప్పిన జగన్‌రెడ్డి అధికారంలోకి రాగానే బీసీలను నిలువునా మోసం చేశాడని టీడీపీ కోవూరు నియోజకవర్గ ఇన్‌చార్జి పోలంరెడ్డి దినేష్‌రెడ్డి ఆరోపించారు. విడవలూరులోని సాయిబాబా సమావేశ మందిరంలో ఆదివారం జరిగిన జయహో బీసీ కార్యక్రమంలో అయన పాల్గొని మాట్లాడుతూ బీసీలంటే ఒట్లు వేసే యంత్రాలు కాదాని, టీడీపీ వారికి సముచిత స్థానం కల్పించిందన్నారు. సొంత కుటుంబ సభ్యులకు న్యాయం చేయ్యలేని వ్యక్తి ముఖ్యమంత్రి కావటం సిగ్గుచేటన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ అధికారంలోని వచ్చిన తరువాత బీసీలకు ప్రత్యేకమైన చట్టాన్ని తీసుకుని వస్తామన్నారు. రావణాసూరుడు రాజ్యం కావాలో రాముడు రాజ్యం కావాలో ఒక్కసారి బడుగు, బలహీన వర్గాల ప్రజలు ఆలోచించాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ అధికార ప్రతినిధి చెముకుల కృష్ణ చైతన్య, మాజీ ఎంఎల్‌సీ బూదాటి రాధయ్య, రైతుసంఘం నాయకులు మాతూరు శ్రీనివాసులురెడ్డి, రాష్ట్ర సాధికారిత కన్వీనర్ పోలిశెట్టి, జిల్లా అర్గనైజింగ్ కమిటి కార్యదర్శి చెంచు కిశోర్, రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి గంపల అనిల్‌కుమార్, జిల్లా మత్స్యకార అధ్యక్షుడు పొవంజి శేషయ్య, నాయకులు ఇంతా మల్లారెడ్డి, చెముకుల శ్రీనివాసులు, నాపా వెంకటేశ్వర్లు నాయుడు, చిమటా వెంకటేశ్వర్లు, ఇమాంబాషా, ఆవుల రవిచంద్ర, తాతా బాలకృష్ణ, రామిశెట్టి వెంకటేశ్వర్లు, పొన్నాడి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరికలు

మండలంలో వైసీపీ నుంచి టీడీపీలోనికి వలసలు ప్రారంభమయ్యాయి. ఇప్పటికే ఊటుకూరుకు చెందిన వైసీపీ నాయకుడు సురేంద్రరెడ్డి పార్టీలో చెరగా తాజాగా దంపూరుకు చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఆదివారం టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. స్థానిక టీడీపీ నాయకులు దూది విజయరాఘవన్, భార్గవ్ ఆధ్వర్యంలో వైసీపీకి చెందిన మావిళ్ల సుబ్బారావు, చేవూరి శ్రావణ్‌కుమార్, పసుమర్తి అనిల్‌కుమార్, వారి అనుచరులు సుమారు 100 మంది పార్టీలో చేరారు. వీరిని కోవూరు టీడీపీ ఇన్‌చార్జీ పోలంరెడ్డి దినేష్‌రెడ్డి కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు హరిబాబు, లక్ష్మీనారాయణ, పమిడాల భాస్కర్, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో త్వరలో ప్రజా ప్రభుత్వం

కోవూరు: రాష్ట్రంలో త్వరలో ప్రజా ప్రభుత్వం ఏర్పడనుందని జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు మనుక్రాంత్‌రెడ్డి, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పోలంరెడ్డి దినేష్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక గుమ్మళ్లదిబ్బలో టీడీపీ, జనసేన పార్టీల నేతలు పర్యటించి ఇంటింటి ప్రచారం చేశారు. ఇరు పార్టీల జెండాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ పాలనకు వ్యతిరేకంగా ప్రజలు టీడీపీ, జనసేన కూటమికి పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు చప్పిడి శ్రీనివాసులురెడ్డి, అల్తాఫ్, టీడీపీ నాయకులు ఇంతా మల్లారెడ్డి, చెంబేటి పెంచలయ్య, బాలరవి, తిరుమూరు అశోక్‌రెడ్డి, యాకసిరి వెంకట రమణమ్మ, హరిబాబు, వినయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో టీడీపీని గెలిపించండి


మనుబోలులో కరపత్రాలు అందిస్తున్న తెలుగుతమ్ముళ్ళు

మనుబోలు, ఫిబ్రవరి 4: రాబోయే సార్వ త్రిక ఎన్నికల్లో ప్రతిఒక్కరూ టీడీపీకి ఓటేసి గెలిపించాలని తిరుపతి పార్ల మెంట్ తెలుగు యువత ప్రధాన కార్యదర్శి పచ్చిపాల రామిరెడ్డి కోరారు. మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఆదేశాలతో తెలుగు తమ్ముళ్ళు ఆదివారం మనుబోలులోని కోదండరామపురం ప్రాంతంలో బాబు ష్యూరిటీ-భవి ష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ ప్రభుత్వం వస్తే చేయబోయే ఆరు పథకాల కరపత్రాలు ఇంటింటా అందించి వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు సాని వెంకటరమణయ్య, దండు చంద్రశేఖర్‌రెడ్డి, అంకయ్య గౌడ్, రాయపాటి కిరణ్‌కుమార్, రమణారెడ్డి, ప్రసాద్, రాజాగౌడ్, సుమంత్, సురేష్ పాల్గొన్నారు.

కనుపూరులో అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభం

వెంకటాచలం, ఫిబ్రవరి 4: గ్రామాల్లో ప్రజలు కోరుకున్న అభివృద్ధి పనులను పూర్తిచేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. మండలంలోని కనుపూరు గ్రామలో ఆదివారం ఆయన పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనం, ముస్లిం శ్మశాన వాటిక ప్రహరీ గోడను ప్రారంభించి అనంతరం పట్టాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ముజిబున్నీసా, ఎంపీపీ మంద కవిత, వైస్ ఎంపీపీలు పచ్చపట్ల మస్తానయ్య, కనుపూరు కోదండరామిరెడ్డి, సర్పంచ్ నాటకం శీనయ్య, సచివాలయాల మండల కన్వీనర్ మందల వెంకటశేషయ్య, వైసీసీ మండల కన్వీనర్ మోహన్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేస్తే ప్రజాదరణ : సీఐ

ముత్తుకూరు, ఫిబ్రవరి 4 : విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేస్తే ప్రజాదరణ లభిస్తుందని కృష్ణపట్నం సీఐ వెంకటరెడ్డి తెలిపారు. ముత్తుకూరు మత్స్య కళాశాల ఆడిటోరియంలో ఆదివారం బదిలీపై వెళ్లిన ముత్తుకూరు ఎస్ఐ శివకృష్ణారెడ్డికి ఆత్మీయ వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలతో మమేకమై పనిచేసే పోలీసులకు ప్రజల్లో ఎప్పుడూ ఆదరణ ఉంటుంద న్నారు. మండలంలో యువత చెడు మార్గం పట్టకుండా నియంత్రిస్తూ క్రీడలవైపు మళ్లేలా వాలీబాల్ స్టేడియం ఏర్పాటు చేశారన్నారు. అనంతరం శివకృష్ణారెడ్డిని గ్రామస్థులు పోలీసు సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల కన్వీనర్ మెట్టా విష్ణువర్ధన్‌రెడ్డి, సీఐలు శ్రీనివాసరెడ్డి, రామకృష్ణారెడ్డి, ముత్తుకూరు ఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి, శివనాంచారయ్య, కృష్ణపట్నం పోర్టు అడ్మిన్ హెడ్, గణేష్‌శర్మ, సెక్యూరిటీ హెడ్ వెంకటేష్, హేమంత్‌కుమార్‌రెడ్డి, వైసీపీ నాయకులు శివప్రసాద్, చిన్నపరెడ్డి, లక్ష్మణ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీని ఓడించేందుకు ప్రజలు సిద్ధం : జానీ మాస్టర్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), ఫిబ్రవరి 4: రాష్ట్రంలో త్వరలో జరగనున్న ఎన్నికల్లో వైసీపీని ఓడించేందుకు ప్రజలు ఓటు అనే ఆయుధంతో సిద్ధంగా ఉన్నారని ప్రముఖ కొరియోగ్రాఫర్, జనసేన నాయకుడు జానీ మాస్టర్ అన్నారు. ఇటీవల జనసేనలో చేరిన ఆయనను జిల్లా జనసైనికులకు పరిచయం చేస్తూ ఆదివారం నగరంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో సభను ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథులుగా జనసేన పార్టీ జాతీయ మీడియా అధికార ప్రతినిధి వేముల పాటి అజయ్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర హాజరయ్యారు. వారు మాట్లాడుతూ దేశంలోనే పెద్ద కొరియోగ్రాఫర్‌గా ఎదిగిన జానీ మాస్టర్ నెల్లూరు బిడ్డ కావడం గర్వంగా ఉందన్నారు. ఆయన జనసేనలో చేరడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

రానున్న రోజుల్లో జనసేనకి ఉజ్వల భవిష్యత్తు : బొబ్బేపల్లి

వెంకటాచలం, ఫిబ్రవరి 4 : రానున్న రోజుల్లో సర్వేపల్లి నియోజకవర్గ జనసేన పార్టీలోకి భారీగా వలసలు ఉంటాయని, జనసేనకి ఉజ్వల భవిష్యత్తు ఉండటంతోనే యువత మద్దతు పలుకుతోందని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బొబ్బేపల్లి సురేష్ నాయుడు అన్నారు. మండలంలోని కంటేపల్లిలో ఆదివారం ఆయన ఆధ్వర్యంలో ఆస్తోటి రవికుమార్ సమక్షంలో 30 కుటుంబాలు జనసేనలో చేరాయి. వీరికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో గుమ్మినేని వాణి భవాని, రత్నం, ఏడు కొండలు, వినోద్, నాగరాజు, వెంకయ్య, నరసయ్య, ధనుంజయ, మణి, చంద్రశేఖర్, పవన్, భాను ప్రకాష్, సురేంద్ర, బాలాజీ, ప్రేమ్ కుమార్, వెంకటేష్, బాబ్జీ, అశోక్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

మండల ఆర్యవైశ్య సంఘం కమిటీ నియామకం


ఎన్నికైన మండల ఆర్యవైశ్య కమిటీ

పొదలకూరు, ఫిబ్రవరి 4 : జిల్లా రూరల్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు అమర్తలూరు చెంచయ్య ఆదేశాల మేరకు మండల ఆర్యవైశ్య సంఘం సర్వ సభ్య సమా వేశం ఆదివారం స్థానిక శ్రీవాసవి కన్యకపరమేశ్వరి ఆలయంలో జరిగింది. ఈ సమావేశంలో మండల ఆర్యవైశ్య సంఘం నూతన కమిటీ నియామకం, అనుబంధ సంఘాల ఎన్నిక నిర్వహించారు. మండల ఆర్యవైశ్య సంఘం గౌరవాధ్యక్షుడిగా చిట్టూరు వెంకటసుబ్ర హ్మణ్యస్వామి, మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా తన్నీరు సురేష్‌బాబు, పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా గుర్రం మధు, మండల యువజన ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా పైడా కామేశ్వర రావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య నేతలు పాల్గొని నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు.

కండలేరు ఎడమ కాలువకు నీటి విడుదల

పొదలకూరు, ఫిబ్రవరి 4 : కండలేరు ఎడమ గట్టు కాలువ కింద ఉన్న చెరువులకు వంద క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు ఆ కాలువ ఈఈ అనిల్‌కుమార్ ఆదివారం తెలిపారు. 10రోజులపాటు 100 క్యూ సెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తామన్నారు. పశువుల దాహార్తి కోసం ఈ నీరు ఉపయోగపడుతుందన్నారు. కాగా, శనివారం మండలంలోని టీడీపీ నాయకులు ఇరిగేషన్ కార్యాలయాన్ని ముట్టడించి రెండు రోజుల్లో నీటిని విడుదల చేయకుంటే నిరాహార దీక్ష చేపడతామని హెచ్చరించడంతో అధికారులు కంటి తుడుపు చర్యలు చేపట్టారని టీడీపీ మండల అధ్యక్షుడు తలచీరు మస్తాన్ బాబు ఆరోపించారు. సాగునీటికి 100 క్యూసెక్కుల నీరు సరిపోదని, పొదలకూరు మండలంలోనే 11వేల ఎకరాలు కాలువ కింద ఉందని, మనుబోలు, చేజర్ల, వెంకటాచలం మండలాల్లో పొలాలకు సాగునీరు అందాలంటే ప్రస్తుతానికి కనీసం అర టీఎంసీ నీటినైన విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

నెల్లూరు సిటీ, రూరల్ కోవూరు, సర్వేపల్లి

ఆర్ఎస్ఎస్‌ను విస్తరించాలి

● నగర సాంఘిక్‌లో నాయకులు

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 4 : రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) శతాబ్ది ఉత్సవాల నాటికి అన్ని బస్తీలలో ఆర్ఎస్ఎస్‌ను విస్తరించాలని ఆ సంఘ్ నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం సాయంత్రం వీఆర్ హైస్కూల్ మైదానంలో నెల్లూరు నగర సాంఘిక్ జరిగింది. నెల్లూరు నగరాన్ని 40 బస్తీలుగా విభజించారు. ఆ బస్తీల నుంచి 2వేల మందికి పైగా నాయకులు తరలివచ్చి విన్యాసాలు చేశారు. ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలు 2025 విజయదశమి నాడు జరుగుతాయని తెలిపారు. రాష్ట్ర ప్రాంతీయ ప్రచార ప్రముఖ్ బయ్యా శ్రీనివాసులు మాట్లాడుతూ సామాజిక పరివర్తన రావాలంటే ఆర్ఎస్ఎస్ శాఖలు విస్తరించాలన్నారు. వచ్చే విజయదశమి నాటికి అన్ని బస్తీలలో ఆర్ఎస్ఎస్ శాఖలు ఏర్పడి ధ్రువీకరించుకోవాలని కోరారు. ఈనెల 19న ఛత్రపతి శివాజీ జయంతి ఉత్సవం నగరంలో ఘనంగా జరుగుతుందని తెలిపారు. ఇందులో సంఘ్ సేవకులతోపాటు దేశభక్తులు అందరూ పాల్గొనాలని కోరారు. కాగా, ఆర్ఎస్ఎస్ సభలో కేశవరావు, ప్రాంత సంచాలక్ నాగారెడ్డి హరిచంద్రారెడ్డి, జిల్లా సంచాలక్ పీ రామదండురెడ్డి, నగర సంచాలక్ సీవీ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.


నగర సాంఘిక్‌లో పాల్గొన్న స్వయం సేవకులు

చంద్రబాబుతోనే యువతకు భవిత

● మాజీ మంత్రి పొంగూరు నారాయణ


టీడీపీ శ్రేణులతో కలిసి డివిజన్లలో పర్యటిస్తున్న నారాయణ

నెల్లూరు (వైద్యం), ఫిబ్రవరి 4 : మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబుతోనే యువతకు మంచి భవిష్యత్తు అని మాజీ మంత్రి, టీడీపీ నేత పొంగూరు నారాయణ అన్నారు. నగరంలోని 6, 48 డివిజన్లలోగల పొర్లుకట్ట, ఉడ్‌హౌస్ సంఘం తదితర ప్రాంతాల్లో ఆదివారం బాబు ష్యూరిటీ - భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. నారాయణ ఇంటింటికి తిరిగి వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని ప్రజలను కోరారు. రాష్ట్రానికి పరిశ్రమలు రాకపోవడంతో పిల్లల భవిష్యత్తు అంధకారంలో ఉందన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి ఒక్క పరిశ్రమ తేవాలన్న ఆలోచన కూడా లేదని విమర్శిం చారు. ఉద్యోగులకు ప్రతి నెల సకాలంలో జీతాలు కూడా ఇవ్వలేని పరిస్థితి వచ్చిందన్నారు. రానున్న టీడీపీ ప్రభుత్వంలో ఆర్థికాభివృద్ధి సాధిస్తామని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కరిముల్లా, రాజా నాయుడు, విజేత రెడ్డి, సత్య నాగేశ్వరరావు, వేలూరు పెంచలబాబు, కీర్తి, పఠాన్ నూర్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలపై నేటి నుంచి ప్రచారం : కమిషనర్

నెల్లూరు(సిటీ), ఫిబ్రవరి 4 : వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర రెండవ విడతలో భాగంలో సోమవారం నుంచి 14 రోజులు కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రచారం నిర్వహించ నున్నట్లు కార్పొరేషన్ కమిషనర్ వికాస్ మర్మత్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ప్రచార కార్యక్రమాల్లో ప్రజలు పాల్గొని తమకు అర్హత ఉన్న పథకాల్లో అక్కడికక్కడే రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో బ్యాంకు, పోస్టాఫీసు సిబ్బంది పాల్గొంటారని తెలిపారు.

టీడీపీలో పెద్ద ఎత్తున చేరికలు

● ఆహ్వానించిన రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి


పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి, గిరిధర్‌రెడ్డి

నెల్లూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు రూరల్ నియోజకవర్గం నుంచి టీడీపీలోకి భారీగా చేరికలు జరిగాయి. నగరంలోని 17వ డివిజన్ వడ్డిపాళేనికి చెందిన యువత, మహిళలు పెద్ద ఎత్తున టీడీపీలో చేరారు. అలానే 26వ డివిజన్ డ్రైవర్స్ కాలనీకి చెందిన కొంతమంది టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరందరికీ రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి పార్టీ కండువాలు కప్పి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ టీడీపీ-జనసేన కూటమి అధికారంలోకి రావాలంటూ ప్రజలంతా ఒకే మాటపై ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో సాబీర్‌ఖాన్, ఊటుకూరు దత్తాత్రేయ, పంట్రంగి అజయ్, గుంజి శ్రీనివాసులు, ఊరందూరు సురేంద్ర బాబు తదితరులు పాల్గొన్నారు. కాగా, 23వ డివిజన్ అనుగుంట, బ్యాంక్ కాలనీ ప్రాంతాల్లో ఎమ్మెల్యే కోటంరెడ్డి సతీమణి సుజితమ్మ, కుమార్తెలు హైందవి, వైష్ణవి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో చంద్రబాబును సీఎంగా, కోటంరెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు.

వేడుకగా లలితాంబ శతజయంతి

నెల్లూరు (లీగల్), ఫిబ్రవరి 4 : ప్రముఖ సంగీత విద్వాంసురాలు గట్టుపల్లి లలితాంబ శత జయంతిని నగరంలోని రేబాల లక్ష్మీనరసారెడ్డి పురమందిరంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. గసల్ సేవా సంస్థ అధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. సంస్థ వ్యవస్థాపక నిర్వాహకుడు గట్టుపల్లి జయచంద్ర, సీనియర్ న్యాయవాది రేవూరు శశికళ మాట్లాడుతూ లలితాంబ సంగీత విద్వాంసురాలిగా దేశ విదేశాలలో అనేక కచేరీలు చేశారని చెప్పారు. తమ సంస్థ పదేళ్లుగా వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన సంగీత కార్యక్రమాలు అలరించాయి.

9న శ్రీవారి కల్యాణం

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 4 : వికాస్ ప్రజాహిత సేవా సమితి ఆధ్వర్యంలో ఈ నెల 9వతేదీన శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆ సమితి వ్యవస్థాపకుడు, 14వ డివిజన్ కార్పొరేటర్ కర్తం ప్రతాప్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమ కరపత్రాలను ఆదివారం వికాస్ హైస్కూల్‌లో ఆవిష్కరించారు. పద్మావతినగర్ అద్దాల సాయిబాబా మందిరం దగ్గర సాయంత్రం 5.30గంటలకు కల్యాణో త్సవం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో మూలస్థానేశ్వరాలయం చైర్మన్ లోకిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, బాలాజీనగర్ సీతారామమందిరం చైర్మన్ ఏవీ గుప్తా, ఉస్మాన్‌సాహెబ్ పేట కాశీవిశ్వనాథస్వామి ఆలయం చైర్మన్ రమణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అందరూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలి

● ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి ● రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భారీ ర్యాలీ


ర్యాలీని ప్రారంభిస్తున్న ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), ఫిబ్రవరి 4: ప్రతి ఒక్కరు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని, అప్రమత్తంగా ప్రయాణిస్తే సురక్షితంగా గమ్యం చేరుకుంటామని ఎస్పీ డాక్టర్ కే తిరుమలేశ్వర రెడ్డి తెలిపారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా జిల్లా రవాణా శాఖ, కిమ్స్ వైద్యశాల ఆధ్వర్యంలో ఆదివారం నెల్లూరులోని ఆర్టీసీ ప్రధాన బస్టాండు నుంచి ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. దీనిని జెండా ఊపి ఎస్పీ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ర్యాష్ డ్రైవింగ్, సీట్ బెల్ట్ పెట్టుకోకుండా కారు నడప డం, హెల్మెట్ ధరించకుండా ద్విచక్ర వాహనాలు నడపడం, ట్రాఫిక్ సిగ్నల్స్‌ను పాటించక పోవడం, మద్యం సేవించి, ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపడం వంటి నిర్లక్ష్యపు చర్యలు వల్ల రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని చెప్పారు. గతేడాది జిల్లాలో 498 మంది రోడ్డు ప్రమాదాల్లో మరణించారని, దేశంలో సంభవిస్తున్న మరణాల్లో ఎక్కువగా రోడ్డు ప్రమాదాలవే ఎక్కువన్నారు. జిల్లా రవాణా శాఖ అధికారి డీ చందర్ రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రజా రవాణా అధికారి పీవీ శేషయ్య, ఎంవీఐలు, ఏఎంవీఐలు, విద్యార్థులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కేన్సర్ వ్యాధిపై అవగాహన కార్యక్రమం

నెల్లూరు (వైద్యం) ఫిబ్రవరి 4 : ప్రపంచ కేన్సర్ నివారణ కార్యక్రమాల్లో భాగంగా నగరంలోని ఎంజీబీ మాల్‌లో ఆదివారం కేన్సర్ వ్యాధిపై అవగాహన కార్యక్రమం జరిగింది. మెడికవర్ ఆసుపత్రి కేన్సర్ విభాగం సెంటర్ హెడ్ డాక్టర్ బిందూ భార్గవిరెడ్డి మాట్లాడుతూ కేన్సర్ బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం కేన్సర్ ఫ్రీ స్క్రీనింగ్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. వైద్యులు ప్రజ లతో ముఖాముఖి నిర్వహించి కేన్సర్‌పై వారి సందేహాలను నివృతి చేశారు. కేన్సర్ థీమ్‌తో మెడికవర్ నర్సింగ్, ఆసుపత్రి మహిళలు ఫ్యాషన్‌షో నిర్వహించారు. విజయ డ్యాన్స్ అకాడమీ చిన్నారులు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. ఈ కార్యక్ర మంలో మెడికవర్ సెంటర్ హెడ్ డాక్టర్ ధీరజ్ రెడ్డి, కేన్సర్ వైద్య నిపుణులు డాక్టర్ రంగరాజన్, డాక్టర్ అవినాష్, డాక్టర్ శ్రీవిద్య, డాక్టర్ శ్రీనివాసులురెడ్డి, డాక్టర్ ప్రియ, డాక్టర్ నవీన్‌రెడ్డి, డాక్టర్ నవనీత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'విద్యా, ఉపాధి, ఉద్యోగం' పుస్తకావిష్కరణ

నెల్లూరు (సాంస్కృతికం) ఫిబ్రవరి 4 : విద్యా, ఉపాధి, ఉద్యోగం అనే పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం నగరంలోని ఇస్కాన్ సిటీలో గల ఓ పాఠశాలలో ఆదివారం జరిగింది. ముఖ్య అతిథిగా తిరుపతి శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం విశ్రాంత ఉపకులపతి ఆచార్య మురళి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ నేటి విద్యా రంగం, ఉపాధ్యాయ రంగంలకేకాక అన్ని రంగాలకు విద్యా ఉపాధి ఉద్యోగం పుస్తకం ఉపయోగపడుతుందని చెప్పారు. యువత వారి కాళ్లపై వారు నిలబడాలంటే సాంకేతిక విద్య, నైపుణ్యంతో కూడిన ఆధునిక పరిజ్ఞానం అవసరమన్నారు. డాక్టర్ ఎస్ఆర్‌కే స్కూలు కరస్పాండెంట్ కే కృష్ణమూర్తి ఆధ్వర్యంలో రూపొం దించిన ఈ పుస్తకాన్ని అందరికీ ఉచితంగానే అందిస్తామని సభ నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి వ్యాఖ్యాతగా వీఆర్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ సీవీ సుబ్రహ్మణ్యం, వ్యాసాలు రాసిన డాక్టర్ ఎం సుబ్రహ్మణ్యం, వీ కృష్ణమూర్తి, ఆర్ సురేష్, ఎస్ గమనం, కేఎస్ రాఘవాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శవాది కర్పూరీ ఠాకూర్

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 4 : బీహార్ తొలి ముఖ్యమంత్రి, దివంగత నేత కర్పూరీ ఠాకూర్ నిరాడంబరుడు, అందరికీ ఆదర్శప్రాయుడని నెల్లూరు జిల్లా నాయీ బ్రాహ్మణ ఉద్యోగుల సొసైటీ అధ్యక్షుడు వేలూరి రంగారావు కొనియాడారు. కర్పూరీ ఠాకూర్‌కు ఇటీవల కేంద్ర ప్రభుత్వం భారతరత్న ప్రకటించిన నేపథ్యంలో ఆదివారం నవాబుపేట నాయీ బ్రాహ్మణ కల్యాణ మండపంలో ప్రత్యేక సభ నిర్వహించారు. ఠాకూర్ చిత్రపటానికి పుష్పమాలలు వేసి నివాళులర్పించారు. రంగరావు మాట్లాడుతూ వెనుకబడిన తరగతికి చెందిన వ్యక్తికి భారతరత్న ఇచ్చి గుర్తించడం నాయీ బ్రాహ్మణులకు, వెనుకబడిన వర్గాల ప్రజలకు గర్వకారణ మన్నారు. నాయీబ్రాహ్మణ ఎంప్లాయీస్ సొసైటీ ప్రధాన కార్యదర్శి వినుకొండ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ యువత, ప్రజాప్రతినిధులు కర్పూరీ ఠాకూర్‌ను ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. సంతపేట అంజనేయస్వామి ఆలయ ధర్మకర్తల మండలి సభ్యుడు తాళ్లూరి రవి, తల్పగిరి రంగనాథస్వామి ఆలయ ధర్మకర్తల మండలి సభ్యురాలు పద్మజను ఈ సందర్భంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ గాండ్ల, తెలికుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మురళీకృష్ణ సుబ్బారావు, వరికుంట్ల హజరత్తయ్య, నూర్‌బాషా సంఘం, విశ్వబ్రాహ్మణ అసోసియేషన్, రజక సంఘం నాయకులు, నవనిర్మాణ సమితి నాయకులు పాల్గొన్నారు.


ఉపన్యసిస్తున్న వేలూరు రంగారావు

రాపూరు అభివృద్ధికి సమష్టి కృషి అవసరం


మాట్లాడుతున్న వ్యవసాయ మండలి చైర్మన్ నెల్లూరు రవీంద్రారెడ్డి

రాపూరు(డక్కిలి), ఫిబ్రవరి 4: రాపూరు మండల అభివృద్ధికి అధికారులు, ప్రజా ప్రతినిధులు సమిష్టిగా కృషిచేయాలని వ్యవసాయ మండలి చైర్మన్ నెల్లూరు రవీంద్రారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి ప్రసన్న అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ రానున్న వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రాపూరు ఆర్టీసీ డిపోలో నడిచే బస్సు సర్వీసులను ఇటీవల కాలంలో వివిధ మార్గాల్లో 10 బస్సుల వరకు రద్దు చేశారని, ఇలా అయితే ఆర్టీసీ డిపో కూడా ఏదో ఒకరోజు తరలిపోతుందని మండల కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ సభ దృష్టికి తీసుకువచ్చారు. ఈ అంశాన్ని అజెండాలో చేర్చి బస్సులు రద్దుకాకుండా చూస్తామని అధికారులు హామీ ఇచ్చారు. అంతకుముందు అధికారులు శాఖలవారీగా మండలంలో జరిగిన అభివృద్ధి, చేపట్టాల్సిన పనుల వివరాలను చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి పెంచలరెడ్డి, అధికారులు, సర్పంచ్‌లు, ఎంపిటిసి సభ్యులు, సొసైటీ అధ్యక్షుడు పాల్గొన్నారు.

నిలిచేదెవరో.. గెలిచేదెవరో!

రెండు జిల్లాల నుంచీ టికెట్ల రేసులో తొమ్మిది మంది వారసులు



వచ్చే ఎన్నికల్లో ప్రధాన పార్టీల అభ్యర్థిత్వాల కోసం రెండు జిల్లాల్లో పలువురు రాజకీయ కుటుంబాల వారసులు రేసులో ఉన్నారు. వీరిలో ఇప్పటికే నలుగురు ఆయా అసెంబ్లీ నియోజకవర్గాలకు ఇన్‌చార్జులుగా ఉండగా.. మరో ఐదుగురు టికెట్ల కోసం పోటీ పడుతున్నారు. ఇప్పుడున్న రాజకీయ వాతావరణంలో వీరిలో ఎందరు ఆయా పార్టీల్లో టికెట్ సాధిస్తారో.. పోటీలో గెలిచి చట్టసభలో తొలిసారిగా అడుగుపెట్టి తమ కుటుంబ రాజకీయ వారసత్వాన్ని ఎందరు నిలబెట్టుకుంటారోనన్న ఆసక్తి ప్రజానీకంలో ఉంది.

– తిరుపతి, ఆంధ్రజ్యోతి

తిరుపతి జిల్లా నుంచి తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి తనయుడు అభినయ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ మనవరాలు కీర్తి, చంద్రగిరిలో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి తనయుడు మోహిత్‌రెడ్డి, సత్యవేడులో మాజీ ఎమ్మెల్యే హేమలత కుమార్తె డాక్టర్ హెలెన్, మాజీ మంత్రి కుతూహలమ్మ సోదరి కుమారుడు రాజేష్, సూళ్లూరుపేటలో కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మి భర్త కృష్ణయ్య, తిరుపతి లోక్‌సభ స్థానంలో సత్యవేడు మాజీ ఎమ్మెల్యే తలారి మనోహర్ చిన్న కోడలు అంగలకుర్తి నీహారిక పేర్లు టికెట్ల రేసులో ప్రధానంగా వినిపిస్తున్నాయి. చిత్తూరు జిల్లాకు సంబంధించి చిత్తూరులో మాజీ ఎంపీ డీకే ఆదికేశవులు మనవరాలు చైతన్య, మాజీ మేయర్ కటారి అనురాధ కోడలు హేమలత పేర్లు ప్రచారంలో ఉన్నాయి.

ఇప్పటికే ఇన్‌చార్జులుగా నలుగురు

తిరుపతిలో భూమన అభినయ్‌రెడ్డి, చంద్రగిరిలో చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, సత్యవేడులో రాజేష్. ఈ ముగ్గురూ వైసీపీ తరఫున ఇన్‌చార్జులుగా కొనసాగుతున్నారు. వీరిలో మోహిత్ రెడ్డిని ఆ పార్టీ ఇదివరకే రానున్న ఎన్నికల అభ్యర్థిగా ప్రకటించేసింది కూడా. ఈ ముగ్గురికీ వచ్చే ఎన్నికల్లో టికెట్లు ఖాయమనే చెప్పాలి. ఏవైనా అనూహ్య పరిణామాలు చోటుచేసుకుంటే తప్ప వీరి పోటీలో మార్పులు ఉండకపోవచ్చు. ఒకవేళ అలాంటి పరిణామాలు తలెత్తితే దానికి సత్యవేడులోనే అవకాశం ఉంటుంది. టీడీపీ విషయానికొస్తే సత్యవేడులో మాజీ ఎమ్మెల్యే హేమలత కుమార్తె డాక్టర్ హెలెన్ ఇప్పటికే ఇన్‌చార్జిగా ఉన్నారు. కాకపోతే అభ్యర్థిత్వం విషయంలో అధిష్ఠానం ఎదుట మరిన్ని పేర్లు పరిశీలనలో ఉన్నాయి. ఇక్కడ అభ్యర్థి ఎవరన్నది తేలాలంటే మరికొన్ని రోజులు నిరీక్షించక తప్పదు. ఈ నలుగురూ ప్రధాన పార్టీల ఇన్‌చార్జులుగా ఉన్నందున ఇతరులతో పోలిస్తే వీరి అవకాశాలు ప్రబలంగానే ఉండనున్నాయి. ఇక, అభినయ్‌రెడ్డి గెలుపు కోసం కరుణాకరరెడ్డిరాజకీయంగా సానుకూల పరిస్థితులు సృష్టించుకునే ప్రయత్నంలో కొంతకాలంగా బిజీగా ఉన్నారు. మోహిత్‌రెడ్డి తండ్రి భాస్కర్‌రెడ్డి పంథాలోనే నిరంతరం జనం మధ్యే ఉంటున్నారు. సత్యవేడు వైసీపీకి రాజేష్ కొత్త వ్యక్తి. స్థానికేతరుడన్న ముద్ర పడుతోంది. పార్టీ శ్రేణులు ఎంతవరకూ అంగీకరిస్తాయన్నది చూడాలి. ఆదిమూలం అనుకూలవర్గం ఏం చేస్తుందనేది కూడా కీలకం కానుంది. అక్కడే టీడీపీ ఇన్‌చార్జి హెలెన్ ఇతర ఆశావహులతో పోలిస్తే ఇప్పటికే నియోజకవర్గమంతా కలియదిరిగేశారు. జనం మధ్యకు వెళుతున్నారు. ఈ నలుగురి అదృష్టం ఎలా ఉందో వేచి చూడాలి.

టికెట్ రేసులో మరో ఐదుగురు

● తిరుపతి మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ మనవరాలు కీర్తి బీటెక్ చదివారు. వివాహమై ప్రస్తుతం హైదరాబాదులో నివాసముంటున్నారు. ఆమె భర్త కూడా అన్నమయ్య జిల్లాలో పేరున్న రాజకీయ కుటుంబానికి చెందిన వారు. గత కార్పొరేషన్ ఎన్నికల్లో కార్పొరేటర్‌గా పోటీ చేయడం ద్వారా ఆమె రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. అప్పట్లో వైసీపీ నాయకులు అనుసరించిన దౌర్జన్యకర పద్ధతుల నడుమ గెలుపు సాధించలేకపోయారు. ఇపుడు టీడీపీ అసెంబ్లీ టికెట్ రేసులో ఉన్నారు. తనకు కాకపోతే మనవరాలికి టికెట్ ఇవ్వమని సుగుణమ్మ పట్టుబడుతున్నారు.

● రెండుమార్లు ఎంపీగా, కేంద్ర మంత్రిగా పనిచేసిన పనబాక లక్ష్మి భర్త, ఐఆర్‌ఎస్ అధికారిగా రిటైరైన కృష్ణయ్య సూళ్లూరుపేట టికెట్ ఆశిస్తున్నారు. నిజానికి భార్యాభర్తలిద్దరూ ఎంపీ, ఎమ్మెల్యే టికెట్లు ఆశించినప్పటికీ ఒక కుటుంబానికి ఒకే టికెట్ విధానాన్ని పార్టీ అనుసరిస్తున్నందున ఒకరికే అవకాశం దక్కే పరిస్థితి. దీంతో కృష్ణయ్య అభ్యర్థిత్వాన్ని పార్టీ అధిష్ఠానం పరిశీలిస్తున్నట్టు సమాచారం. నియోజకవర్గ టీడీపీ వర్గాల్లో కూడా ఆయన పేరు ప్రచారంలో ఉంది.

● తిరుపతి లోక్‌సభ స్థానం నుంచీ టీడీపీ టికెట్ రేసులో సత్యవేడు మాజీ ఎమ్మెల్యే తలారి మనోహర్ చిన్న కోడలు అంగలకుర్తి నీహారిక పేరు వినిపిస్తోంది. మాజీ ఐఏఎస్ అధికారి రత్నప్రభ కుమార్తె అయిన ఆమె అభ్యర్థిత్వాన్ని టీడీపీ అధిష్ఠానం సీరియస్‌గానే పరిశీలిస్తున్నట్టు సమాచారం. పార్టీ వర్గాల్లో అయితే దాదాపు ఆమె అభ్యర్థిత్వం ఖరారైపోయిందని, ప్రకటించడమే తరువాయి అన్న ప్రచారం నడుస్తోంది.

● చిత్తూరులో జనసేన టికెట్ రేసులో మాజీ ఎంపీ డీకే ఆదికేశవులు మనవరాలు చైతన్య పేరు వినిపిస్తోంది. ఆదికేశవులు పెద్ద కుమార్తె తేజస్విని కూతురైన చైతన్య శ్రీకాళహస్తీశ్వరాలయ ట్రస్టుబోర్డు మాజీ చైర్మన్ గురవయ్యనాయుడు కుమారుడు రాజేష్‌ను వివాహం చేసుకున్నారు. తాత, నాన్నమ్మ రాజకీయ వారసురాలిగా చిత్తూరు నుంచీ జనసేన టికెట్ సాధించి జనసేన-టీడీపీ ఉమ్మడి అభ్యర్థిగా పోటీ చేసేందుకు ఆమె గట్టిగా ప్రయత్నిస్తున్నారు. జనసేన అధిష్ఠానం కూడా ఆమె పేరును సీరియస్‌గానే పరిశీలిస్తున్నట్టు సమాచారం.

● చిత్తూరులోనే టీడీపీ టికెట్ రేసులో మాజీ మేయర్ హేమలత పేరూ బలంగా వినిపిస్తోంది. ఆమె మాజీ మేయర్ కటారి అనురాధ కోడలు. అనురాధ మృతితో కార్పొరేటరుగా గెలిచి మేయర్‌గా ఎన్నికయ్యారు. స్థానిక సంస్థలకు పరిమితమైన ఆమె రాజకీయ జీవితాన్ని ఇపుడు మరో మెట్టు పైకి చేర్చాలని యత్నిస్తున్నారు. అధిష్ఠానం పరిశీలిస్తున్న ఆశావహుల్లో ఆమె కూడా ఒకరు.

అలాంటి వారి నాలుకలు కోస్తా

- మంత్రి ఎదుటే ఎమ్మెల్యే వర్గీయులకు కట్టా వార్నింగ్
- పేట వైసీపీలో విభేదాలు మరోసారి బట్టబయలు

తడ, ఫిబ్రవరి 4: సూళ్లూరుపేట వైసీపీలో వర్గవిభేదాలు మరోసారి బట్టబయలయ్యాయి. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఎదుటే నాలుకలు కోస్తానంటూ ఎమ్మెల్యే వ్యతిరేక వర్గానికి చెందిన నేత అనడం చర్చనీయాంశమైంది. ఆదివారం నాయుడుపేట మండలం మేనకూరు సచివాలయం వద్ద జరిగిన పలు ప్రారంభోత్సవాలకు మంత్రి హాజరయ్యారు. ఇప్పటికే నియోజకవర్గంలో ఎమ్మెల్యే అనుకూల, వ్యతిరేక వర్గాలుగా వైసీపీ చీలిపోవడంతో ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య తప్ప, ఆయన వర్గీయులంతా గైర్హాజయ్యారు. సమావేశంలో పాల్గొన్న వైసీపీ నాయకుడు కట్టా సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ 3, 4 తరగతులు చదువుకున్న ఒకరికి ఎన్‌డీసీసీబీ చైర్మన్ పదవి కట్టబెడితే ఆయన వ్యవహారశైలి దారుణంగా ఉందని విమర్శించారు. కొంతమంది నాయకుల వల్ల పార్టీకి చెడ్డపేరు వస్తోందని, అటువంటివారి నాలుకలు కోస్తానంటూ ఎమ్మెల్యే వర్గీయులను ఉద్దేశించి వ్యాఖ్యానించడంతో మరోసారి వర్గవిభేదాలు బయటపడ్డాయి. దీన్ని మంత్రి వారించకపోగా, ఇక్కడి వర్గ విభేదాలను సర్దుబాటు చేసేందుకు కృషి చేస్తానని చివరిలో అనడం విశేషం. ఇక సమావేశానికి ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్యే కిలివేటి.. ఎడముఖం, పెడముఖంగా వ్యవహరించారు.దీనిపైనా వైసీపీ శ్రేణుల్లో చర్చ జరిగింది.




ఐక్యతను చాటుతున్న నాయకులు

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఐదు స్థానాలివ్వాలి

లేకుంటే ఇండిపెండెంట్లుగా పోటీచేస్తాం
'సింహగర్జన'లో బీసీ జేఏసీ అధ్యక్షుడు

తిరుపతి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): 'ఉమ్మడి చిత్తూరు జిల్లాలో రాబోయే ఎన్నికల్లో బీసీలకు ఐదు అసెంబ్లీ సీట్లు కేటాయించాలి. లేకుంటే ఇండిపెండెంట్లుగా పోటీకి దిగుతాం' అని బీసీ జేఏసీ అధ్యక్షుడు అన్నా రామచంద్రయ్య యాదవ్ స్పష్టం చేశారు. గత ఏడాది డిసెంబరు ఏడో తేదీన శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో ప్రారంభమైన బీసీ చైతన్య రథ యాత్ర ఆదివారం తిరుపతిలో ముగిసింది. ఈ సందర్భంగా స్థానిక ఇందిరామైదానంలో 'మరో స్వాతంత్ర్య పోరాటం కోసం సింహ గర్జన' పేరిట బహిరంగ సభ నిర్వహించారు. రామచంద్రయ్య మాట్లాడుతూ.. బీసీలకు రాజ్యాధికారం వచ్చినప్పుడే నిజమైన స్వాతంత్ర్యం వచ్చినట్టు అవుతుందన్నారు. బీసీ నేత జీఆర్ నాగగోని మాట్లాడుతూ.. 75 శాతం బీసీలు రాజ్యాధికారానికి దూరమయ్యారన్నారు. కేవలం కులవృత్తులకే పరిమితం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. మరోనేత వెంగళరావు యాదవ్ మాట్లాడుతూ.. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందే కానీ బీసీలకు రాలేదని వాపోయారు. బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు లాకా వెంగళరావు నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు నాగమణి, నాగసత్యం, కరాటేకల్యాణి, నూకాలమ్మ, ఆవుల లక్ష్మణ్, స్థానిక బీసీ నేతలు పాల్గొన్నారు.



రేపు చిత్తూరు జిల్లాకు చంద్రబాబు రాక

వెదురుకుప్పం/గంగాధరనెల్లూరు, ఫిబ్రవరి 4: గంగాధరనెల్లూరు సమీపం రామానాయుడుపల్లె బస్టాప్ వద్ద మంగళవారం జరిగే 'రా.. కదలిరా' బహిరంగ సభ కోసం టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు హాజరు కానున్నారు. మధ్యాహ్నం 2.50 గంటలకు ఆయన రామానాయుడుపల్లె హెలిప్యాడ్‌కు వస్తారు. అక్కడ్నుంచి 3 గంటలకు సభా ప్రాంగణానికి చేరుకుంటారు. 3 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు బహిరంగసభ జరుగుతుంది. అనంతరం 4.35 గంటలకు 4.45 రామానాయుడుపల్లె హెలిప్యాడ్ నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 5 గంటలకు రేణిగుంట విమానాశ్రయం చేరుకుంటారు. 5.10 గంటలకు విమానంలో విజయవాడకు బయలుదేరుతారు.

గ్రామం వదిలినా ఓటు తొలగించరా?

తొట్టంబేడు, ఫిబ్రవరి 4: తొట్టంబేడు మండలంలోని చిట్టత్తూరు గ్రామం వదిలి వెళ్లిన ఓ 35 మంది ఓట్లను జాబితా నుంచి తొలగించలేదు. సుబ్రమణ్యం, పార్వతమ్మ, పాండురంగం, చరణ్‌కుమార్ అనేవారు 20 ఏళ్ల కిందట గ్రామం విడిచిపెట్టి శ్రీకాళహస్తి పట్టణంలోని 9వ వార్డులో ఉంటున్నారు. అలాగే రాచగున్నేరికెళ్లిపోయిన చంద్రశేఖర్, హేమలత దంపతులతోపాటు పదేళ్ల కిందట వివాహమై చంద్రగిరిలో కాపురముంటున్న కోమల.. ఇలా గ్రామం విడిచిపెట్టిన 35 మంది ఓట్లు ఇంకా జాబితాలోనే ఉన్నాయి. ఈ ఓట్లను తొలగించాలని అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్నా ఫలితం లేకపోయిందని టీడీపీ, జనసేన నాయకులు తెలిపారు.



20 ఏళ్ల కిందట ఊరొదిలిన వారు



రాచగున్నేరికి వెళ్లిన వారు



ముక్కంటి ఆలయంలో భక్తుల రద్దీ

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 4: ముక్కంటి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. వారాంతపు సెలవులతో వేకువజాము నుంచే క్యూలైన్లో బారులు తీరారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా దేశ నలుమూలల నుంచి కూడా అధిక సంఖ్యలో విచ్చేశారు. రూ.200 శీఘ్ర దర్శనం టికెట్లు 1758, రూ.50 ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు 3,272 భక్తులు కొనుగోలు చేశారు. ఉదయం నుంచి రాత్రి వరకు సుమారు 27వేల మంది భక్తులు దర్శించుకున్నట్లు అధికారులు అంచనా వేశారు.



తిరుపతిలో.. అంబాజీపేట మ్యారేజి బ్యాండు

తిరుపతి(కొర్లగుంట), ఫిబ్రవరి 4: తాము నటించిన అంబాజీపేట మ్యారేజి బ్యాండు చిత్రానికి మంచి ఆదరణ లభిస్తోందని హీరో సుహాస్, హీరోయిన్ శివాని వెల్లడించారు. దర్శకుడు దుష్యంత్, నిర్మాత ధీరజ్‌తో కలిసి వారు తిరుపతిలోని ప్రతాప్ థియేటర్‌ను ఆదివారం రాత్రి సందర్శించారు. థియేటర్‌లో ప్రేక్షకుల స్పందన చూసి సంతోషం వ్యక్తం చేశారు. కర్నూలు, కడప థియేటర్లను సందర్శించామని, అక్కడ కూడా పూర్తి సామర్థ్యంతో సినిమాను ఆదరిస్తున్నారని అన్నారు. ఈ సందర్భంగా సెల్ఫీలు తీసుకునేందుకు అభిమానులు పోటీపడ్డారు. గ్రూప్ థియేటర్స్ ఓనర్ సతీష్, మేనేజర్లు కృష్ణ, ప్రభాకర్ వారి వెంట ఉన్నారు.

10వరకు ఇంటర్ తత్కాల్ ఫీజు గడువు పొడిగింపు

తిరుపతి(విద్య), ఫిబ్రవరి 4: ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు (ప్రథమ, ద్వితీయ) హాజరయ్యే విద్యార్థులకు తత్కాల్ ఫీజు గడువును ఈనెల 10వ తేదీ వరకు పొడిగించారు. ఈ మేరకు ఇంటర్ బోర్డు కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారని ఆర్ఐవో జీవీ ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. ఇప్పటివరకు పరీక్ష ఫీజు చెల్లించని రెగ్యులర్, ప్రైవేట్ విద్యార్థులు రూ.3వేల అపరాధ రుసుంతో ఈనెల 10న సాయంత్రం ఐదు గంటల్లోపు ఆన్‌లైన్‌లో చెల్లించే వెసులుబాటు కల్పించారన్నారు. దీన్ని విద్యారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



భవనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశా


స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాలకు భవనాల పరిశీలన

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 4: ఈవీఎంలను భద్రపరిచేందుకు అవసరమైన స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాల కోసం అవసరమైన భవనాలను కలెక్టర్ లక్ష్మీశా ఆదివారం పరిశీలించారు. పద్మావతి మహిళా యూనివర్సిటీలోని పలు భవనాలు, అందులోని గదులను ఆయన చూశారు. ప్రత్యేకించి ఇంజనీరింగ్ కాలేజీ భవనాలను పరిశీలించారు. జేసీ శుభం బన్సల్, ఆర్డీవో నిషాంత్‌రెడ్డి, ఇన్‌చార్జి తహసీల్దార్ అశోక్‌రెడ్డి, ఆర్‌ఎస్‌డీటీ రామచంద్రారెడ్డి ఆయన వెంట ఉన్నారు.

బ్రాడ్‌కాస్టింగ్ కార్యాలయానికి దారేది?

● మిస్సింగ్ ప్రకటనలకు భక్తుల ఇక్కట్లు

తిరుమల, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో తప్పిపోయిన తమ వారి ప్రకటనల కోసం భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. హిందూ ధర్మ ప్రచారం, పరిరక్షణ కోసం తిరుమలలోని ఆస్థాన మండపంలో శనివారం నుంచి ధార్మిక సదస్సు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో స్వామీజీలు, అధికారుల కార్లను ఆస్థానమండపం పక్కనే ఉన్న బ్రాడ్‌కాస్టింగ్ కార్యాలయం ముందు పార్కింగ్ చేస్తున్నారు. దాంతో బ్రాడ్‌కాస్టింగ్ కార్యాలయం వైపు భక్తులను రానీయకుండా సిబ్బంది చర్యలు తీసుకోవడంతో తప్పిపోయిన తమ వారి వివరాలను మైకుల ద్వారా ప్రచారం చేసేందుకు వచ్చే భక్తులు ఇబ్బంది పడుతున్నారు. బ్రాడ్ కాస్టింగ్ కేంద్రం వరకు వెళ్లలేక, తమ వారు ఎక్కడున్నారో తెలుసుకోలేక అగచాట్లు పడుతున్నారు. కొందరు పోలీస్‌స్టేషన్‌కు, మరికొందరు సీసీ కెమెరా కమాండ్ కంట్రోల్ రూమ్‌కు వెళుతున్నారు.



బ్రాడ్‌కాస్టింగ్ కేంద్రం ముందు నిలిపి ఉన్న కార్లు

పదవుల కోసమే కార్పొరేషన్లు: నెలవల



సమావేశంలో మాట్లాడుతున్న నెలవల సుబ్రహ్మణ్యం

తడ, ఫిబ్రవరి 4: వైసీపీ నేతలకు పదవులు కట్టబెట్టడానికి కులాల పేరిట ప్రభుత్వం కార్పొరేషన్లు ఏర్పాటు చేసి బీసీలను మభ్యపెట్టిందని సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం విమర్శించారు. ఆదివారం తడలో జయహో బీసీ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం ఆర్భాటంగా ఏర్పాటు చేసిన వివిధ కులాల కార్పొరేషన్లకు నిధులు కేటాయించకపోవడంతో నిర్వీర్యమైపోయాయని అన్నారు. బీసీలకు రాజకీయ ప్రాధాన్యం ఇచ్చింది ఎన్టీఆర్, చంద్రబాబే అని గుర్తు చేశారు. సీఎం జగన్ నా బీసీలు, నా బడుగు, బలహీన వర్గాలు అంటూ వారిపైనే తప్పుడు కేసులు బనాయించి జైలుపాలు చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్ర ఖజానాను లూటీ చేసి, ఆ డబ్బుతో వచ్చే ఎన్నికల్లో గెలవచ్చని భ్రమలో జగన్ ఉన్నారని తెలిపారు. తిరుపతి పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు నరసింహ యాదవ్ మాట్లాడుతూ వైసీపీ శ్రేణులకు వచ్చే ఎన్నికల్లో ఓటమి రుచిని చూపిస్తామని చెప్పారు. ప్రజలు సైతం రాష్ట్ర భవిష్యత్తు టీడీపీతోనే అని నిర్ధారణకు వచ్చారని స్పష్టం చేశారు. సమావేశంలో టీడీపీ అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి బొమ్మన శ్రీధర్, ఓజిలి, పెళ్లకూరు మండలాల అధ్యక్షులు సంచి కృష్ణయ్య, విజయకుమార్, బీసీ సెల్ అధ్యక్షుడు సదాశివం, కార్యదర్శి మునస్వామి, నాయకులు సుదర్శన్, బొమ్మన పళణి, సెల్వం, జయపాల్, రవి, భాస్కర్, మెస్ రమణయ్య, మాధవ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే మహిళా సాధికారిత

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 4: టీడీపీతోనే మహిళా సాధికారిత సాధ్యమని నియోజకవర్గ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. ఆదివారం మున్సిపాలిటీ పరిధిలోని మన్నారుపోలూరు న్యూ కాలనీలో బాబు ష్యూరిటీ - భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలనూ మోసం చేసిందన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి చెందుతుందని, వచ్చే ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శిలు ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్, నాపా మునిరాజా, మునస్వామి, మేడా సాయి నారాయణ, పెంచలయ్య, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సంరక్షణకు జాగ్రత్తలు పాటించాలి



ఎమ్మెల్యే వరప్రసాద్‌రావును సన్మానిస్తున్న క్రీడాకారులు

గూడూరు, ఫిబ్రవరి 4: ప్రతిఒక్కరరూ ఆరోగ్య సంరక్షణకు జాగ్రత్తలు పాటించాలని ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు అన్నారు. ఆదివారం స్థానిక ఏఏరెడ్డి ప్రభుత్వ స్టేడియంలో క్రీడాకారులు, వాకర్ల ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను సన్మానించారు. ఈ సందర్భంగా క్రీడాకారులు మాట్లాడుతూ స్టేడియం అభివృద్ధికి ఎమ్మెల్యే ఎంతో కృషి చేశారన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, క్రీడల్లో పాల్గొనడం వల్ల శారీరక దారుఢ్యం మెరుగుపడడంతో పాటు మానసిక ఉల్లాసం పెరుగుతుందన్నారు.అనంతరం హకీ క్రీడాకారులకు ఎమ్మెల్యే సొంత నిధులతో క్రీడా సామగ్రి అందజేశారు. అదేవిధంగా అమరావతి ఆస్పత్రికి చెందిన డాక్టర్ రమణయ్య, నిర్మల దాతృత్వంతో మహిళలకు యోగా మ్యాట్‌లను అందజేశారు. కార్యక్రమంలో వేగూరు రాజేంద్రప్రసాద్, మునిగిరీష్, విజయ్‌కుమార్, నాగేశ్వరరావు, సుబ్రహ్మణ్యం, దీపక్‌ఆకాష్, లవకుమార్, నరసయ్య, మస్తాన్ పాల్గొన్నారు.

రాజ్యాంగంపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలి

నాయుడుపేట, ఫిబ్రవరి 4: రాజ్యాంగంపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని అంబేడ్కర్ ధర్మపోరాట సమితి(ఏడీపీఎస్) వ్యవస్థాపక అధ్యక్షుడు ఇంగిలాల రామచంద్రరావు అన్నారు. నాయుడుపేట ఎస్‌పీజీసీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అంబేడ్కర్ సిద్ధాంతాలపై ఆదివారం వర్క్‌షాపు నిర్వహించారు. కార్యక్రమంలో ఏడీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు యర్రబోతు సుబ్రహ్మణ్యం, ప్రిన్సిపాల్ డాక్టర్ గురవయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తూపిలి నాగరాజు, జంగిటి వెంకటయ్య, జిల్లా అధ్యక్షుడు సంపూర్ణబాబు, గుణ, శివ, రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

తాళమ్మకు నెలపొంగళ్లు

గూడూరు, ఫిబ్రవరి 4: గ్రామదేవత తాళమ్మ ఆలయంలో ఆదివారం భక్తులు నెలపొంగళ్లు పెట్టారు. భోగి పండుగ తరువాత వచ్చే మూడో ఆదివారం అమ్మవారికి నెలపొంగళ్లు పెట్టడం ఆనవాయితీ. ఉదయం అమ్మవారిని ప్రత్యేకంగా పూలతో అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకుని పొంగళ్లు పెట్టుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ఆవరణలో అన్నదానం చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

విగ్రహం ఏర్పాటుకు స్థల పరిశీలన

వాకాడు, ఫిబ్రవరి 4: మండలంలోని స్వర్ణముఖినది సమీపంలో మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దనరెడ్డి విగ్రహం ఏర్పాటు చేసేందుకు ఆదివారం స్థల పరిశీలన చేశారు. జనార్దనరెడ్డి తనయుడు, వెంకటగిరి నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త రాంకుమార్‌రెడ్డి ఇంజనీరింగ్ అధికారులతో కలసి స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో కొడవలూరు భక్తవత్సల్‌రెడ్డి, పాపారెడ్డి రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వివాదాస్పద స్థలం పరిశీలన



రికార్డులను పరిశీలిస్తున్న ఆర్డీవో కిరణ్‌కుమార్

వెంకటగిరి టౌన్, ఫిబ్రవరి 4: పట్టణంలోని ఎన్‌జేఆర్ సర్కిల్‌లో మీ సేవ కేంద్రం వద్ద ఉన్న వివాదాస్పద స్థలాన్ని గూడూరు ఆర్డీవో కిరణ్ కుమార్ ఆదివారం పరిశీలించారు. సర్వే నెం. 227.10లో 48సెంట్ల ప్రభుత్వ స్థలానికి కొంత కాలం క్రితం ఓ వ్యక్తి పెన్సింగ్ ఏర్పాటు చేయడంతో అధికారులు అడ్డుకున్నారు. కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన హైకోర్టులో పిటిషన్ వేశారు. ఈ నేపథ్యంలో ఆర్డీవో కిరణ్‌కుమార్ సదరు స్థలాన్ని పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ రమేష్ బాబు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

ముత్యాలమ్మకు పూజలు

చిల్లకూరు, ఫిబ్రవరి 4: మండలంలోని తూర్పుకనుపూరు గ్రామంలో వెలసిన ముత్యాలమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. పలు ప్రాంతాల నుంచి వచ్చి భక్తులు ఆలయం వద్ద పొంగళ్లు పెట్టుకుని నైవేద్యం నివేదించి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

కోటమ్మకు...

కోట, ఫిబ్రవరి 4: గ్రామదేవత కోటమ్మకు ఆదివారం విశేష పూజలు జరిగాయి. అమ్మవారికి పలు అభిషేకాలు చేసి పండితులు చందన, పుష్పాలంకరణలో ఉంచారు. కోట, వాకాడు, చిట్టమూరు, చిల్లకూరు, ఓజిలి మండలాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ పాలకమండలి ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

వైద్యఖర్చులకు ఆర్థిక సాయం

చిల్లకూరు, ఫిబ్రవరి 4: మండలంలోని చేడిమాల గ్రామానికి చెందిన రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దొరవారిసత్రం మండలం తనియాలి గ్రామానికి చెందిన మునిరాజ వైద్యఖర్చులకు రూ.25వేల నగదు అందజేశారు. పదిరోజుల క్రితం కూలి పనులకు వెళ్లి తిరిగి ఇంటి వెళుతున్న మునిరాజా ప్రమాదవశాత్తు కిందపడడంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. నెల్లూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆదివారం బాధితుడి భార్య మల్లీశ్వరికి ట్రస్ట్ ట్రస్ట్ సభ్యులు నగదు అందజేశారు.

రైల్లో నుంచి జారిపడి ప్రయాణికుడి మృతి



తడ, ఫిబ్రవరి 4: ప్రమాదవశాత్తు రైల్లో నుంచి జారిపడి ప్రయాణికుడు మృతి చెందాడు. శనివారం రాత్రి సమయంలో చెన్నై నుంచి సూళ్లూరుపేటకు వెళ్తున్న సబర్బన్ రైలు నుంచి సుమారు 55 నుంచి 60 సంవత్సరాల వయస్సు కలిగిన ఓ వ్యక్తి రైలు దిగుతూ ప్రమాదవశాత్తు జారి కిందపడి తీవ్ర గాయాలపాలయ్యాడు. స్టేషన్ సిబ్బంది 108 వాహనంలో సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం నెల్లూరుకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతి చెందాడు. అతని వద్ద చెన్నై అత్తిపట్టు నుంచి సూళ్లూరుపేట వరకు తీసుకున్న టికెట్ మాత్రమే లభ్యమైంది. ఇతర వివరాలు ఏవీ తెలియలేదు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైసీపీ పాలనతో జనం విసిగిపోయారు: పాశిం



టీడీపీలో చేరిన వారితో సునీల్‌కుమార్

గూడూరు, ఫిబ్రవరి 4: వైసీపీ ప్రభుత్వ అరాచక పాలనతో జనం విసిగిపోయారని మాజీ ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో కోట మండలం తిమ్మానాయుడుపాళెం, చిల్లకూరు మండలం రెట్టపల్లి గ్రామానికి చెందిన పలువురు టీడీపీలో చేరారు. వారికి సునీల్‌కుమార్ పార్టీ కండువాలను కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్కచాన్స్ పేరుతో అధికారంలోకి వచ్చిన జగన్ రాష్ట్రంలోని అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేశారని విమర్శించారు. వైసీపీ నాయకుల అవినీతి, దౌర్జన్యాలు, దాడులతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రశ్నించిన వారిపై దాడులు చేయడమే కాకుండా తప్పుడు కేసులు పెట్టి వేధిస్తున్నారని దుయ్యబట్టారు. ప్రధానంగా యువతకు ఉపాధి అవకాశాలు కల్పించకపోవడంతో నిరుద్యోగులుగా మారి అవస్థలు పడుతున్నారన్నారు. ఎస్సీ, ఎస్టీలకు సంక్షేమ పథకాలను రద్దు చేయడంతో పాటు ఎస్సీ కార్పొరేషన్ నిధులను పక్కతోవ పట్టించి దళితులు, గిరిజనులను ఈ ప్రభుత్వం మోసం చేసిందన్నారు. టీడీపీ ప్రభుత్వంతోనే బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి సాధ్యమవుతుందని, నిరుద్యోగులకు నిరుద్యోభృతి కల్పించిన ఘనత చంద్రబాబునాయుడుకే దక్కుతుందన్నారు. అభివృద్ధిని కాంక్షించే టీడీపీలో పలువురు చేరుతున్నారని, ముఖ్యంగా యువత అధిక సంఖ్యలో చేరుతుండడం సంతోషకరంగా ఉందని సునీల్ కుమార్ అన్నారు. రానున్న ఎన్నికల్లో పార్టీని గెలిపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్వోత్తరెడ్డి, రవీంద్రరెడ్డి, సుబ్బయ్య, రమేష్, అశోక్, ప్రసాద్, బిల్లు చెంచురామయ్య, అబ్దుల్ రహీమ్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ గెలుపునకు సమష్టిగా కృషి చేయండి: మంత్రి పెద్దిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి

నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 4: వైసీపీ గెలుపునకు పార్టీ శ్రేణులంతా సమష్టిగా కృషి చేయాలని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. నాయుడుపేట - మేనకూరులో నూతనంగా నిర్మించిన వైఎస్సార్ స్మృతివనం, పాల శీతలీకరణ కేంద్రం, రైతు భరోసా కేంద్రం, ఆయూష్మాన్ భారత్ హెల్త్ సెంటర్, గ్రంథాలయాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ వైసీపీ శ్రేణులంతా ఒకే కుటుంబమని, అరమరికలు వస్తుంటాయని, వాటిని మరచి పార్టీ విజయానికి కృషి చేయాలని ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్యే సంజీవయ్యకు హితవుపలికారు. వైఎస్ రాజశేఖరరెడ్డి మేనకూరుకు సెజ్‌ను తీసుకురావడంతో వేలాది మంది కార్మికులు ఉపాధి పొందుతున్నారని అన్నారు. మేనకూరులో కోట్లాది రూపాయలతో ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడంతో వైసీపీ రాష్ట్ర కార్యదర్శి కట్టా సుధాకర్‌రెడ్డిని మంత్రి అభినందించారు. అంతకుముందు సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ పేదలకు సేవచేసే తమ కుటుంబాన్ని విమర్శిస్తే ఖబడ్దార్ అంటూ హెచ్చరించారు. నియోజకవర్గంలో కొందరు సొంతపార్టీ నేతలనే టార్గెట్ చేస్తూ విమర్శిస్తున్నారని, ఇలాంటివి మానుకొని పార్టీ విజయానికి కృషి చేయాలన్నారు. పదవులు ముఖ్యంకాదని, ప్రజలకు చేసిన సేవే చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. అనంతరం ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య మాట్లాడుతూ పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన మేనకూరుకు కోట్లాది రూపాయలు వెచ్చించి అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. కాగా, మంత్రి పాల్గొన్న అభివృద్ధి కార్యక్రమాల్లో ఎమ్మెల్యే సంజీవయ్య అనుచరవర్గం ఎవరూ పాల్గొనకపోవడంతో చర్చనీయాంశమైంది. కార్యక్రమంలో వైసీపీ జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి, నెల్లూరు జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, జడ్పీటీసీ కట్టా జ్యోతి, వైసీపీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కట్టా వెంకటరమణారెడ్డి, రేణిగుంట విమానాశ్రయ అభివృద్ధి కమిటీ సభ్యుడు కట్టా కమలాకర్‌రెడ్డి, విజయ డెయిరీ డైరెక్టర్ కట్టా భవానీశంకర్‌రెడ్డి కట్టా కోటారెడ్డి, షేక్ రఫీ, మధురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీని తరిమికొట్టండి: టీడీపీ



కరపత్రాలు అందజేస్తున్న టీడీపీ నాయకులు

చిల్లకూరు, ఫిబ్రవరి 4: రాష్ట్రంలో అరాచక పాలన సాగిస్తున్న వైసీపీ ప్రభుత్వాన్ని రానున్న ఎన్నికల్లో తరిమికొట్టాలని టీడీపీ నాయకులు అన్నారు. ఆదివారం మండలంలోని అన్నంబాక గ్రామంలో బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా టీడీపీ నాయకులు ఇంటింట ప్రచారం నిర్వహించి కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమన్నారు. వైసీపీ పాలనతో రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం చంద్రబాబునాయుడు అనే సంక్షేమ పథకాలను అమలు పరిచేలా మినీ మెనిఫెస్టోను రూపొందించారన్నారు. రానున్న ఎన్నికలలో ప్రజలు టీడీపీకి మద్దతుగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లురెడ్డి, వెంకటేశ్వర్లునాయుడు, మునిశేఖర్‌గౌడ్, కుమార్, వంశీరెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, శేషయ్య, వెంకటేశ్వరమ్మ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీని తరిమికొడదాం: జనసేన



సిద్ధమ్మకండ్రిగలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న జనసేన నేతలు

కోట, ఫిబ్రవరి 4: రాష్ట్రంలో అరాచక పాలన సాగిస్తున్న వైసీపీ ప్రభుత్వాన్ని ప్రజలు తరిమికొట్టాలని ఉమ్మడి నెల్లూరు జిల్లా జనసేన ఉపాధ్యక్షుడు తీగల చంద్రశేఖర్‌రావు కోరారు. మండల పరిధిలోని కేశవరం పంచాయతీలో గల సిద్ధమ్మకండ్రిగలో ఆదివారం 'జనంలోకి జనసేన' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిద్ధమ్మకండ్రిగ, రామాపురం గ్రామాల్లో జనసేన నాయకులు పర్యటించి వైసీపీ వైఫల్యాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బాలసుబ్రహ్మణ్యం, మోహన్, ఇంద్రవర్షన్, అంకయ్య, కోటయ్య, పరుశురామ్, శ్రీనాథ్, మాతయ్య, జగదీష్, సురేష్, రాము తదితరులు పాల్గొన్నారు.

జనంలోకి జనసేన

వాకాడు, ఫిబ్రవరి 4: మండలంలోని వాకాడు గిరిజన కాలనీలో ఆదివారం జనంలో జనసేన కార్యక్రమం నిర్వహించారు. జనసేన మండల అధ్యక్షుడు రౌతు శివకుమార్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు కరపత్రాలు అందజేశారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జనసేన నాయకులు వంశీ, కల్యాణ్, చైతన్య పాల్గొన్నారు.

జర్నలిస్టులపై దాడి హేయమైన చర్య

గూడూరు, ఫిబ్రవరి 4: ఏలూరు జిల్లాలో జర్నలిస్టులపై వైసీపీ కార్యకర్తలు దాడి చేయడం హేయమైన చర్య అని మీడియా ప్రతినిధులు అన్నారు. ఆదివారం స్థానిక టవర్‌క్లాక్ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద జేపీఎండబ్ల్యూఏ ఆధ్వర్యంలో మీడియా ప్రతినిధులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏలూరు జిల్లా దెందులూరు నియోజకవర్గంలో శనివారం జరిగిన సీఎం జగన్ సిద్ధం సభలో వైసీపీ కార్యకర్తలు మీడియా ప్రతినిధులపై దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. సాక్షాత్తు సీఎం సభలోనే జర్నలిస్టులపై వైసీపీ కార్యకర్తలు దాడికి పాల్పడడం దారుణమన్నారు. నిందితులను వెంటనే అరెస్ట్ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

చిల్లమూరులో భవిష్యత్తు గ్యారెంటీ



కరపత్రాలను అందజేస్తున్న గణపర్తి కిషోర్‌నాయుడు

చిట్టమూరు, ఫిబ్రవరి 4: మండలంలోని చిల్లమూరు గ్రామంలో ఆదివారం మండల అధ్యక్షుడు గణపర్తి కిషోర్‌నాయుడు ఆధ్వర్యంలో బాబు షూరిటీ - భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ మేనిఫెస్టోలోని అంశాలపై అవగాహన కల్పిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కిషోర్‌నాయుడు మాట్లాడుతూ తల్లికి వందనం ద్వారా ఇంట్లో చదువుతున్న ప్రతి ఒక్కరికి ఏటా 15వేలు, ఆడ బిడ్డ నిధి ద్వారా ప్రతి నెల రూ.1500, అన్నదాతకు ఏటా రూ.20వేలు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, నిరుద్యోగ యువతకు ఉద్యోగాల కల్పన, దీపం పథకం ద్వారా ఏటా నాలుగు సిలిండర్లు ఉచితంగా అందజేయడం జరుగుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నేత మారంరెడ్డి జనార్దనరెడ్డి, సర్పంచు రాజేష్‌రెడ్డి, వెంకటరమణ, మణిబాబు, అంకబాబు, మురళీధర్, తదితరులు పాల్గొన్నారు.

నెహ్రూ యువజన కేంద్రం సలహామండలి సభ్యుడిగా శ్రీనివాస్

గూడూరు, ఫిబ్రవరి 4: నెల్లూరు జిల్లా నెహ్రూ యువజన కేంద్రం సలహామండలి సభ్యుడిగా గూడూరు పట్టణానికి చెందిన గుమ్మడి శ్రీనివాస్‌ను నియమిస్తూ ఆ కేంద్రం డైరెక్టర్ నితీష్‌కుమార్ మిశ్రా ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆదివారం శ్రీనివాస్ తెలిపారు.

క్యాన్సర్ నివారణకు అవగాహన ప్రధానం

వైద్య ఆరోగ్యశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ కృష్ణబాబు

తిరుపతి సిటీ, ఫిబ్రవరి 4: క్యాన్సర్‌ను పూర్తి స్థాయిలో నివారించాలంటే దానిపై అవగాహన ప్రధానమని వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు అన్నారు. ప్రపంచ క్యాన్సర్ దినం సందర్భంగా స్విమ్స్ పద్మావతి మహిళా వైద్య కళాశాల ఆవరణలో ఆదివారం ఏర్పాటు చేసిన క్యాన్సర్ అవేర్నెస్ వాక్‌ను ఆయన ప్రారంభించారు. కలెక్టర్ లక్ష్మీశా, డీఎంహెచ్‌వో శ్రీహరి, స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీ కుమార్, టీటీడీ ప్రత్యేకాధికారి జయచంద్రారెడ్డితో కలిసి స్విమ్స్ సర్కిల్ వరకు ర్యాలీలో పాల్గొన్నారు. కృష్ణబాబు మాట్లాడుతూ గ్రామస్థాయి నుంచి ప్రజలకు క్యాన్సర్‌పై అవగాహన పెంచాల్సిన బాధ్యతను ఆరోగ్య కార్యకర్తలు తీసుకోవాలన్నారు. క్యాన్సర్‌తో ఏ ఒక్కరూ చనిపోకూడదనే ఉద్దేశంతో దాని నివారణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ క్యాన్సర్‌ను ముందుగానే గుర్తిస్తే వారి ప్రాణాలను కాపాడవచ్చన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో శ్రీహరి, స్విమ్స్ ఎంఎస్ రామ్ తదితరులు పాల్గొన్నారు.

యోగాలో నోబెల్ వరల్డ్ రికార్డు



నోబెల్ వరల్డ్ రికార్డు సర్టిఫికెట్లతో సంధ్యారాణి

గూడూరు, ఫిబ్రవరి 4: యోగా విభాగంలో మాజీ ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ సతీమణి సంధ్యారాణి నోబెల్ వరల్డ్ రికార్డు సాధించారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ గతేడాది నవంబరులో హైదరాబాదుకు చెందిన వసంత్ యోగా అకాడమీ ఆధ్వర్యంలో ఆన్‌లైన్ ద్వారా నిర్వహించిన యోగా పోటీల్లో పాల్గొనడం జరిగిందన్నారు. విరామం లేకుండా 108సార్లు అతి తక్కువ సమయంలో సూర్యనమస్కారాలు చేయడంతో ఢిల్లీకి చెందిన నోబెల్ వరల్డ్ రికార్డు సంస్థ నిర్వాహకులు తమకు నోబెల్ వరల్డ్ రికార్డును శనివారం ప్రకటించారని తెలిపారు. పలువురు ఆమెకు అభినందనలు తెలిపారు.

గ్రామ దేవతకు పొంగళ్లు



పొంగళ్లు పెట్టేందుకు వెళ్తున్న గ్రామస్తులు

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 4: మండల పరిధిలోని పెరిమిటిపాడు గ్రామంలో ఆదివారం గ్రామదేవత ముత్యాలమ్మకు పొంగళ్లు పెట్టారు. గ్రామస్తులు మేళ, తాళాలతో పొంగళ్లు పెట్టేందుకు ఇంటి వద్ద నుంచి వచ్చి ప్రత్యేక పూజలనంతరం పొంగళ్లు పెట్టారు. కార్యక్రమంలో వంకా రమేష్, వంకా శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.


తహసీల్దార్ హత్య కేసులో నిందితుడిని కఠినంగా శిక్షించాలి

పెళ్లకూరు, ఫిబ్రవరి 4: విశాఖలో తహసీల్దార్ రమణయ్యను హత్య చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని ఏపీజీఈఏ కార్యదర్శి బూదనం రమేష్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ హత్యకు పాల్పడిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలన్నారు. రెవిన్యూ ఉద్యోగులకు రక్షణ కల్పించాలని ప్రభుత్వాని కోరారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.22 కోట్లు

తిరుమల, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.22 కోట్లు లభించింది. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శనివారం లెక్కించి ఆదివారం ఉదయం ప్రకటించింది. ఇక, శ్రీవారిని ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల బీజేపీ కోఇంచార్జ్ పొంగులేటి సుధాకర్, తెలంగాణ ఎమ్మెల్యే వాకాటి శ్రీహరి ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో శ్రీవారిని దర్శించుకున్నారు.

జపాన్‌లో శ్రీసిటీ మార్కెటింగ్ బృందం సమావేశాలు



జెట్రో ప్రతినిధులతో శ్రీసిటీ అధికారులు

శ్రీసిటీ, ఫిబ్రవరి 4: భవిష్యత్‌లో శ్రీసిటీ-జపాన్ వ్యాపార బంధం మరింత బలోపేతం అయ్యే దిశగా శ్రీసిటీ మార్కెటింగ్ బృందం చొరవ చూపుతోంది. గత వారం టోక్యో ఆటోమోటివ్ వరల్డ్ ఎక్స్‌పోలో పాల్గొనడంతోపాటు ప్రస్తుతం జపాన్‌లో పర్యటిస్తూ చురుగ్గా.. మార్కెటింగ్ ప్రణాళికలను అనుసరిస్తోంది. ఇందులో భాగంగా జపాన్‌లో భారత రాయబారి సీబీ జార్జ్‌తో నిర్వహించిన సమావేశంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సలహాదారు (పరిశ్రమలు, మౌలిక సదుపాయాలు, పెట్టుబడులు) ఆర్.వీరారెడ్డి, జమైకాలోని జపాన్ మాజీ రాయబారి, శ్రీసిటీకి సలహాదారు మసనోరి నకనో శ్రీసిటీ సీనియర్ వైస్‌ప్రెసిడెంట్ (మార్కెటింగ్) ఆర్.శివశంకర్, డిప్యూటీ జనరల్ మేనేజర్ (మార్కెటింగ్) గోపికృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు శ్రీసిటీ ప్రగతి, ప్రత్యేకతలను వివరించారు. ప్రస్తుతం 28 దేశాలకు చెందిన 210 కంపెనీలు శ్రీసిటీలో ఏర్పాటు అయ్యాయని, అందులో జపాన్ దేశ పరిశ్రమలు 30 ఉన్నట్లు చెప్పారు. శ్రీసిటీ భారతదేశంలో రెండో అతి పెద్ద జపనీస్ ఇండస్ట్రియల్ టౌన్‌షిప్‌గా పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ చురుకైన పారిశ్రామిక విధానాల ఫలితంగా శ్రీసిటీ మరింత వేగవంతమైన పురోగతిని సాధిస్తూ ప్రధాన పెట్టుబడి గమ్యస్థానంగా మారిందంటూ భారత రాయబారి ప్రశంసించారు. ఇంకా జపాన్ ఎక్స్‌టర్నల్ ట్రేడ్ ఆర్గనైజేషన్ (జెట్రో), మినిస్ట్రీ ఆఫ్ ఎకానమీ, ట్రేడ్, ఇండస్ట్రీ(మెటీ)లకు చెందిన సీనియర్ ప్రతినిధులతో సైతం శ్రీసిటీ అధికారులు సమావేశమై చర్చించారు. జపనీస్ ఇండస్ట్రియల్ టౌన్‌షిప్‌లో చేపడుతున్న పనులు, శ్రీసిటీలోని జపాన్-ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఫర్ మాన్యుఫ్యాక్చరింగ్ (జిమ్) పనితీరు, ఇతర వ్యాపార వ్యవహారాలపై వీరు ప్రధానంగా చర్చలు జరిపారు. ఎస్ఎంబీసీ బ్యాంకు, మిజుహో బ్యాంకు, జపాన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ వంటి ప్రముఖ సంస్థల ప్రతినిధులతో సమావేశమై పెట్టుబడులు, ఇతర అంశాలపై చర్చించారు. శ్రీసిటీ ప్రయత్నాలు మంచి ఫలితాలను సాధిస్తాయని, జపాన్‌తో శ్రీసిటీ వ్యాపార బంధం మరింత బలోపేతం అవుతుందంటూ శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి విశ్వాసం వ్యక్తం చేశారు.

టీడీపీ జిల్లా కార్యదర్శిగా శోభన్‌నాయుడు



శోభన్‌ను సన్మానిస్తున్న నెలవల

నాయుడుపేట, ఫిబ్రవరి 4: నాయుడుపేట పట్టణంలోని బేరిపేటకు చెందిన శోభన్ నాయుడును తిరుపతి జిల్లా టీడీపీ కార్యదర్శిగా నియమించినట్లు నియోజకవర్గ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం తెలిపారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో నెలవల సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో శోభన్‌నాయుడును శాలువా కప్పి సన్మానించారు. టీడీపీ నాయకులు విజయకుమార్ నాయుడు, శ్రీనివాసులు నాయుడు, కిష్టయ్య, పసల గంగాప్రసాద్, మాధవ నాయుడు, అవధానం సుధీర్, రాజేంద్ర, బాబు, లక్ష్మయ్య, చిరువెళ్ల మునిరాజ, సుజాతమ్మ, సుగుణమ్మ, సురేష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వరికోతలు ప్రారంభం



వరికోత కోస్తున్న యంత్రం

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 4: సూళ్లూరుపేట వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో వరి కోతలు ప్రారంభమయ్యాయి. రబీ సీజన్‌లో ముందుగా నాటిన పొలాల్లో వరి కోత దశకు చేరుకుంది. మండలంలోని మంగానెల్లూరు, మంగళంపాడు, పడమటి కండ్రిగ, కోటపోలూరు గ్రామాల్లో వరి కోతలు జోరుగా సాగుతున్నాయి. మిచౌంగ్ తుఫాన్ ప్రభావంతో కొంతమేర పంటనష్టం జరగడంతో దిగుబడి తగ్గిందని రైతులు చెబుతున్నారు.

ఆడ్వాణీకి భారతరత్న హర్షణీయం

కోట, ఫిబ్రవరి 4: బీజేపీ సీనియర్ నేత, మాజీ ఉప ప్రధాని లాల్‌కృష్ణ ఆడ్వాణీకి కేంద్ర ప్రభుత్వం దేశ అత్యున్నత పురస్కారం 'భారతరత్న' ప్రకటించడం పట్ల ఆ పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. కోట పట్టణంలో ఆదివారం బీజేపీ మండల అధ్యక్షుడు సారంగం రమేష్‌బాబు, వాసు, పనబాక కోటేశ్వరరావు, అంబరీషా, వెంకటేశ్వర్లు, వెంకయ్యగౌడ్ బాణసంచా పేల్చి స్వీట్లు పంచిపెట్టారు.